www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 290 ISSUE : 290 | మంగళవారం, 17 మార్చి, 2026 TUESDAY, MARCH 17, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



- అభినందనలు తెలియచేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2 లో..



## భద్రాచలం రాములోరి పెళ్లికి సీఎం రేవంత్

- రూ.100 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఆలయ ప్రాకార నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న సీఎం

కొత్తగూడెం,(వార్త వేదిక సూర్య)-మార్చి16: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రూ.100 కోట్ల నిధులతో చేపట్టనున్న రామాలయ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మిగతా 2లో..

## చారిత్రక మార్పు దిశగా
# తెలంగాణ అడుగులు

- క్యూర్, ప్యూర్, రేర్ జోన్లతో వేగంగా అభివృద్ధి..
- సంస్కరణలతో ప్రజలకు విస్తృత అవకాశాలు
- మూసీ సుందరీకరణతో నయా హైదరాబాద్
- వరల్డ్ గ్లోబల్ హబ్‌గా కోర్ అర్బన్ రీజియన్
- జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో క్యూర్ చట్టం
- రూ.4,903 కోట్లతో యంగ్ ఇండియా స్కూళ్లు
- అసెంబ్లీలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగం
- సీఎం, మంత్రుల కితాబు.. బీఆర్ఎస్ నిరసన

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 16: 'తెలంగాణ రాష్ట్రం చారిత్రక మార్పు దిశగా అడుగులేస్తోంది. ఈ ఏడాది బడ్జెట్.. కేవలం ఆర్థిక కేటాయింపుల కోసమే కాదు. అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన భవిష్యత్తు తెలంగాణ నిర్మాణానికి మార్గదర్శనం. రాష్ట్రంలోని ప్రతి పౌరుడి ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలను తీర్చేందుకు.. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడే రోడ్ మ్యాప్' అని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వెల్లడించారు. ఆవిష్కరణల్లో అగ్రగామిగా, బలహీన వర్గాలకు భరోసాగా, ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే తెలంగాణను నిర్మించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మిగతా 2లో..





## రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచుకునేదెలా?

- సీఎం రేవంత్‌తో ప్రభుత్వ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ భేటీ
- ఆదాయ పెంపు మార్గాలపై చర్చ
- ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి
- ఆర్థిక సలహాదారు సూచనలతో తుది నిర్ణయం తీసుకోవాలి
- అధికారులకు స్పష్టం చేసిన సీఎం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 16: రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో చర్చ జరిగింది. ప్రభుత్వానికి సంబంధించిన కీలక విభాగాల్లో ఆదాయాన్ని పెంచుకోవడానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. సోమవారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, సీఎంవో అధికారులు, రిజిస్ట్రేషన్, విద్యుత్తు శాఖ, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఆదాయ పెంపునకు ఉన్న అవకాశాలపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఆదాయం పెంచుకోవడానికి తీసుకున్న చర్యలను అరవింద్ సుబ్రమణియన్ ఈ సందర్భంగా మిగతా 2లో..

## 30 వరకు అసెంబ్లీ సమావేశాలు!



2 లో..

- మధ్యలో 4రోజులు సెలవులు..
- 20న బడ్జెట్.. నేడు, రేపు గవర్నర్ ప్రసంగంపై చర్చ
- చర్చకు 18న ముఖ్యమంత్రి సమాధానం
- బీఏసీ సమావేశంలో నిర్ణయం!
- 20 రోజులు నిర్వహించాలన్న విపక్షాలు



2 లో..

## భవిష్యత్ ప్రణాళికలపైనే దృష్టి సారిద్దాం

- సభకు రాకపోతే ఎమ్మెల్యే అవడం ఎందుకు?
- కష్టపడి సాధించుకున్న పదవికి న్యాయం చేయాలి
- సభకు వచ్చి ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి
- రాజకీయాల్లో వ్యక్తిగత నష్టం ఉండదు..
- అది వ్యవస్థ మొత్తానికి నష్టం చేస్తుంది
- సీఎల్పీ భేటీలో సిఎం రేవంత్ హితబోధ

## ఉద్యమంలో లేని రేవంత్ తెలంగాణ చరిత్రను
# రూపుమాపే దుస్సాహసం

- బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం కానే కాదు
- శాసనసభ ఆవరణలో గవర్నర్ ఆవిష్కరించిన తెలంగాణ తల్లి మన తల్లికాదు
- అధికారంలోకి వచ్చాక అసెంబ్లీలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్టిస్తాం
- విశారదన్ మహారాజ్ అరెస్ట్ అక్రమం.. వెంటనే విడుదల చేయాలి: కల్వకుంట్ల కవిత

2 లో..



## రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన

- సంగారెడ్డి జిల్లా మన్నూర్‌లో అత్యధికంగా 2.4 సెంటీమీటర్లు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో భారీ వర్షం
- వడగండ్ల వానతో పంటలకు నష్టం
- హైదరాబాద్‌లో చల్లబడిన వాతావరణం
- నేడు, రేపు వర్షాలు

2 లో..






## కౌంటర్ దాఖలుకు ఇదే లాస్ట్ ఛాన్స్

- కోకాపేట భూములపై బీఆర్ఎస్‌కు హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 16: ఎక్సలెన్స్ సెంటర్, మానవ వనరుల అభివృద్ధి కేంద్రం నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో 11 ఎకరాల కేటాయింపుపై కౌంటర్ దాఖలు చేయనందుకు బీఆర్ఎస్‌పై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. చిట్టచివరి అవకాశంగా మూడువారాలపాటు









# చారిత్రక మార్పు దిశగా తెలంగాణ అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఉభయసభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గవర్నర్ మాట్లాడుతున్న సమయంలో నిరసన తెలుపుతూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేయగా... ప్రసంగాన్ని సమర్థిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంచుకునే ప్రతి పాలసీ, అమలు చేస్తున్న ప్రతి సంస్కరణ ఈ ప్రాంత ప్రజలకు విస్తృత అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు. వికసిత్ భారత్-2047విజన్‌కు అనుగుణంగా తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను ప్రభుత్వం రూపొందించిందని పేర్కొన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను రూపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2025-26లో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) రూ. 17.82 లక్షల కోట్లు కాగా, 10.7శాతం వృద్ధి రేటు నమోదైందని చెప్పారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.99 శాతం ఉండగా... రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరుకుందని వివరించారు. గవర్నర్ ప్రసంగం పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా, సమతుల్యంగా, సమ్మిళితంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా, క్యూర్, ప్యూర్, రేర్ పేరిట వికేంద్రీకృత వ్యూహాన్ని అనుసరిస్తోంది. నెట్ జీరో సిటీగా, వరల్డ్ గ్లోబల్ హబ్‌గా కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య ఉన్న పెరీ అర్బన్ రీజియన్(ప్యూర్)ను మాన్యుఫ్యాక్చర్, లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ఇక, రూరల్ అగ్రి రీజియన్(రేర్)లో వ్యవసాయ అనుకూల విధానాలు, ఎకో టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలను నెలకొల్పాలని యోచిస్తోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా గ్రేటర్ హైదరాబాద్‌ను సైబరాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. పునఃవ్యవస్థీకరణతో నగర పాలనను ప్రజలకు మరింత చేరువ చేయనుంది. ఇప్పుడున్న జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో కొత్తగా క్యూర్ చట్టాన్ని తీసుకురానుంది. హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు, హైడ్రాను ఒకటే పాలనా పరిధిలోకి తేనుంది. హిల్ట్ పాలసీతో కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు బయటకు తరలించాలని నిర్ణయించింది. మూసీ, ఈసా నదుల సంగమం వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించింది. 55 కిలోమీటర్ల మేర మూసీ సుందరీకరణతో నయా హైదరాబాద్ ఆవిష్కృతం కానుంది. గోదావరి నీటిని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు అనుసంధానం చేసి, 2.5 టీఎంసీల నీటితో మూసీకి జీవం పోయనుంది. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య అనుసంధానాన్ని మరింత మెరుగుపరచడానికి రేడియల్ రోడ్లను నిర్మించే ప్రతిపాదనలున్నాయి. ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచడానికి వరంగల్, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాలను వేగంగా నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. 30,000 ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయనుంది. ఇందుకోసం ఇప్పటికే ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస విధంగా ఫ్యూచర్ సిటీ కోసం దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో రూ.5.75లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడం గర్వకారణం. రాష్ట్రవ్యాప్తంగా 15.12లక్షల కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఫలితంగా రాష్ట్రంలోని 3.38కోట్ల మంది ప్రజా పంపిణీ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇప్పటివరకు 3,24,536 ఇళ్లు మంజూరు చేయగా... 2,62,449 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు 269కోట్ల జీరో టికెట్లు ఇచ్చాం. గృహజ్యోతి కింద 53.09 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల మేర ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. దీనికి రూ.3,900 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూళ్ల నిర్మాణానికి ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.4,903 కోట్ల రుణం తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ఏటా 11,000 కోట్లు ఖర్చు చేస్తోంది. వరంగల్ హెల్త్ సిటీ, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీ నగర్‌లో టిమ్స్ ఆస్పత్రులు, ఉస్మానియా ఆస్పత్రి, 17 మెడికల్ కాలేజీల నిర్మాణం కొనసాగుతోంది. డ్రగ్స్ ముప్పును ఎదుర్కొనేందుకు ఈగల్‌ను ఏర్పాటు చేసింది. ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం ప్రత్యేక బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది.

## 30వరకు అసెంబ్లీ సమావేశాలు!

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 16:

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన సోమవారం బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీజేపీ సభ్యుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం సభ్యుడు కౌసర్ మొహిద్దీన్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరలు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాలను కనీసం 20 రోజులపాటు నిర్వహించాలని విపక్ష సభ్యులు కోరారు. అయితే, ఈ నెల 30వ తేదీతో సమావేశాలను ముగించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

## భవిష్యత్ ప్రణాళికలపైనే దృష్టి సారిద్దాం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 16:

రాష్ట్రంలో గత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించే సమయం అయిపోయిందని, ఇక భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి సారిద్దామని కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు వేసుకునే ప్రణాళికే వచ్చే ఎన్నికల్లో అజెండా కానుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సభ్యులు శాసనసభకు సరిగా హాజరవకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. "ఒక వ్యక్తి ఎమ్మెల్యే కావడానికి పార్టీ కార్యకర్త మొదలుకొని నాయకులు, ప్రజల వరకు ఎంతో మంది కష్టపడతారు. అలాంటి ఎమ్మెల్యే పదవికి న్యాయం చేయాలి. కానీ, కొందరు ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరు కావట్లేదు. కొంత మంది వచ్చి సంతకం పెట్టి వెళ్లిపోతున్నారు. సభలో కూర్చోకపోతే ఇంక ఎమ్మెల్యే అవడం ఎందుకు?" అంటూ రేవంత్‌రెడ్డి సభ్యులకు హితబోధ చేశారు. అందరూ సభకు హాజరై ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొట్టాలని సూచించారు. అధికారం పోతే తన ఒక్కడికే కాదని, అందరికీ పోతుందని గుర్తుచేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలను నిర్దేశించుకునేందుకుగాను కమిటీ హాల్లో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఇందులో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభకు ఎమ్మెల్యేలు సరిగా హాజరు కాకపోవడం, ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా స్పందించకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'సీఎల్పీ సమావేశానికీ కొందరు ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. కీలక భేటీకీ రానంత బిజీగా ఉన్నారా?' అని సీఎం ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల విషయంలో నిర్లక్ష్యం తగదని, అందరూ హాజరై చర్చల్లో పాల్గొనాలని సూచించారు. ప్రధాన ప్రతిపక్షం ఈ సమావేశాల కోసం భారీగా కసరత్తు చేసినట్లు కనిపిస్తోందని, శిక్షణా తరగతులూ నిర్వహించుకుందని గుర్తుచేశారు. వారు లేవనెత్తే ప్రతి ప్రశ్నకూ సమాధానం చెప్పేందుకు ఎమ్మెల్యేలు సన్నద్ధం కావాలన్నారు. ఎవరికి ఏ అంశంపై అవగాహన ఉందో.. దానిపైనే చర్చలో పాల్గొనాలన్నారు. ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకునే విప్‌లు.. మరింత చురుగ్గా ఉండాలని సూచించారు. ప్యానల్ స్పీకర్‌గా బాలూ నాయక్ సభను బాగా నడుపుతున్నారని కితాబిచ్చారు. మహిళా ఎమ్మెల్యేల్లో బాగా చదువుకున్నవారు ఉన్నారని, వారు చర్చల్లో క్రియాశీలంగా ఉండాలని చెప్పారు. మిగిలిపోయిన అసెంబ్లీ కమిటీలను త్వరగా పూర్తిచేయాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు మీడియాతో చిట్‌చాట్‌లు, వ్యక్తిగతంగా మాట్లాడడం వంటివి చేయొద్దని స్పష్టం చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత నష్టం ఉండదని, మొత్తం వ్యవస్థకే నష్టం చేస్తుందని చెప్పారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందన్నారు. పార్టీ, ప్రభుత్వ లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు. అందరి లెక్కలూ పార్టీ నాయకత్వం రాసుకుంటోందని, బీ ఫాంలు ఇచ్చేటప్పుడు పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు. సభలో స్పీకర్ మైకు ఇచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే కావడానికి 30 ఏళ్లు పట్టిందని గుర్తుచేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసేందుకు మంత్రులు సమయం ఇవ్వాలని తెలిపారు. తానూ సమయం ఇస్తానన్నారు. ప్రజా ప్రభుత్వంలో మూడో బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని, ఈ సారి బడ్జెట్లో భవిష్యత్తు ప్రణాళికలు ఉండబోతున్నాయని చెప్పారు. సభలో చర్చ పక్కదారి పట్టకుండా సమర్థంగా నడిపేలా చూడాలని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు సబ్జెక్ట్ మాట్లాడడానికి కూడా సమయం ఇవ్వలేదని, కొట్లాడి మైక్‌ను తీసుకున్నామని గుర్తుచేశారు. సెషన్ మొత్తం సస్పెండ్ చేసి.. తాను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులూ సభకు రాకుండా చేశారన్నారు. సీఎల్పీ నేతలుగా ఉన్న జానారెడ్డి, భట్టివిక్రమార్కలకు కూడా మైక్ ఇవ్వలేదని చెప్పారు. "ఇది మన ప్రభుత్వం.. ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాపే వచ్చే ఎన్నికలకు అజెండా అవుతుంది" అని రేవంత్ అన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆరు గ్యారెంటీల విషయంలో ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు దీటుగా తిప్పికొట్టాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సూచించారు. సమావేశాలకు సభ్యులు సకాలంలో, విధిగా హాజరు కావాలని చెప్పారు. ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లెక్కలతో సహా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని సీఎల్పీ అభినందించింది. సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. సీఎల్పీ సమావేశం అనంతరం.. శాసనమండలి ప్రవేశ ద్వారం వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం రేవంత్‌రెడ్డి గ్రూప్ ఫొటో దిగారు.

## రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచుకునేదెలా..?

(మొదటి పేజీ తరువాయి)

వివరించినట్లు సమాచారం. రాష్ట్రంలో ఇప్పటికే మార్కెట్ విలువల పెంపుపై ప్రతిపాదనలను సిద్ధం చేసిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు.. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. ఏప్రిల్ నుంచి కొత్త మార్కెట్ విలువలు అమల్లోకి వస్తాయనే చర్చ నేపథ్యంలో.. మార్కెట్ విలువల సవరణ మీద చర్చించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని అరవింద్ సుబ్రమణియన్ ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. ఆర్థిక సలహాదారు ఇచ్చిన సూచనల ప్రకారం ఆదాయం పెంపుపై తుది నిర్ణయం తీసుకోవాలని సీఎం రేవంత్ ఆదేశించినట్లు సమాచారం. విద్యుత్తు శాఖలో సంస్కరణల ద్వారా రాబడి పెంచుకోవడానికి ఉన్న అవకాశాలపై, డిస్కమ్‌ల పరపతి పెంపు, టారిఫ్ రాయితీ వంటి అంశాలపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. ఎలాంటి సంస్కరణల ద్వారా డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలనే అంశంపై చర్చించినట్లు సమాచారం. తాజాగా రైతుల కోసం ప్రత్యేకంగా ఒక డిస్కమ్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున.. ఆ డిస్కమ్ మనుగడపైనా చర్చించినట్లు తెలిసింది. జీఎస్టీ రాబడిపైనా సుదీర్ఘంగా చర్చించారు.

## భద్రాచలం రాములోరి పెళ్లికి సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో జిల్లా కలెక్టర్‌తో భేటీ అయిన తుమ్మల.. సీఎం పర్యటన ఏర్పాట్లు, జిల్లా అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు రూ.300 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అందులో భాగంగా తొలివిడతలో ఆలయ ప్రాకార నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారని తుమ్మల పేర్కొన్నారు. 'భక్తుల సేవలో ప్రభుత్వం' అనే నినాదంతో నవమి ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుపై గతంలో ప్రతిపాదించిన 2 స్థలాలను ఎయిర్‌పోర్టు అథారిటీ తిరస్కరించిన నేపథ్యంలో, భద్రాచలం-కొత్తగూడెం మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్‌కు సూచించారు. రాష్ట్రప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఆయిల్‌పామ్ సాగు సబ్సిడీలపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి16:

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లా మన్నూర్‌లో అత్యధికంగా 2.4, మెదక్ జిల్లా రేగోడ్‌లో 1.8, సంగారెడ్డి జిల్లా రాయికొడ్‌లో 1 సెంటీమీటర్ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురవగా, మరికొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, తేలికపాటి వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. మెదక్ జిల్లా తూప్రాన్, శివ్వంపేటలో 30 నిమిషాల పాటు భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. మామిడి తోటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షంతో కొన్నిచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల చెట్లు కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్‌లోని బాలానగర్, అల్వాల్, అస్ఫనగర్, నాంపల్లి, ఖైరతాబాద్, మల్కాజిగిరి, అస్ఫనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. మేడ్చల్ పట్టణం, ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో వడగండ్ల వాన కురిసింది. రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్నిచోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న ఐదు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమేపి మూడు నుంచి నాలుగు డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది.



## నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 16:

తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ 2025 పురస్కారం లభించడం పట్ల, సిధారెడ్డి కి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిన కవి నందిని సిధారెడ్డి గారు రాసిన "అనిమేష" కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. సిధారెడ్డి కరోనా మహమ్మారి కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను చిత్రీకరించడంవల్ల తనకు సమాజంపట్ల ఉన్న నిబద్ధతను, అలాగే తనలోనున్న ఆర్ద్రతను తెలియజేస్తుందని, వారు గొప్ప మానవతావాదని అన్నారు. సిధారెడ్డి గారి సుదీర్ఘ సాహిత్య కృషికి లభించిన గౌరవమని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపడంలో వారు పోషించిన పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆధునిక తెలుగు కవిత్వంలో నందిని సిధారెడ్డి ఎన్నో పరిశోధనాత్మక రచనలతో సాహితీ రంగానికి విశిష్ట సేవలు అందించారని, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం వారి సాహిత్య ప్రస్థానానికి దక్కిన గౌరవంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సాహితీ రంగంలో సిధారెడ్డి గారు మరెన్నో శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ఉద్యమంలో లేని రేవంత్ తెలంగాణ చరిత్రను రూపుమాపే దుస్సాహసం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 16:



తెలంగాణ ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రను రూపుమాపే దుస్సాహసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో మండిపడ్డారు. చరిత్ర నిర్మాణంలో పాల్గొనని వారు మొదట చేయాలనుకునే పనే చరిత్రను చెరిపివేయడం అన్నారు. అది కుదరకపోతే చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తారని చెప్పారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి కూడా అదే పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసన సభ ప్రాంగణంలో ఈరోజు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహంపై స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన ఆ విగ్రహం తెలంగాణ చరిత్రను అమానించేలా ఉందన్నారు. బతుకమ్మ లేకుండా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ఆత్మకు ఎంతమాత్రం కూడా ప్రతిరూపం కాదని చెప్పారు. సమస్త తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని అన్నారు. తమ ములాలను మదిలో తలుస్తూ తెలంగాణ బిడ్డలంతా కూడా ఉద్యమ సందర్భంలో తెలంగాణ తల్లికి అపురూపంగా ఇచ్చిన రూపమే బతుకమ్మతో కూడిన తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రాష్ట్రోద్యమ కాలంలో ఏర్పరచుకున్న తల్లి రూపురేఖలు మార్చడం, ఉద్యమ గుర్తులను చెరిపేయటమంటే అది మూర్ఖపు పనేనని ఆమె అన్నారు. తనకు స్థానం లేని ఉద్యమ చరిత్రను రూపుమాపుతున్నానని భ్రమిస్తూ రేవంత్ రెడ్డి అల్ప సంతోషంలో ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక... అమరుల త్యాగాలను ఒడిసి పట్టుకున్న నాటి ఉద్యమ తెలంగాణ తల్లిని అదే చోట ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సగౌరవంగా కాంగ్రెస్ కు ఆఫీస్ కు తరలిస్తామని తేల్చిచెప్పారు.

### విశారదన్ మహరాజ్ అరెస్ట్ అక్రమం

ఖమ్మం వెలుగుమట్ల బాధితులకు అండగా నిలిచేందుకు వెళ్లిన ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ను పోలీసులు అరెస్ట్ చేయటాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖండించారు. ఈ అరెస్ట్ అక్రమమని అన్నారు. అరెస్ట్ చేసిన విశారదన్ మహరాజ్ ను పలు స్టేషన్లకు తిప్పుతూ ఇబ్బంది పెట్టటం దారుణమన్నారు. వెంటనే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణకే గర్వకారణం

ప్రముఖ కవి, అధ్యాపకులు నందిని సిధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావటం ఎంతో సంతోషానిచ్చిందని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం కృషి చేసిన ఆయనకు ఈ అవార్డు రావటం తెలంగాణకే గర్వకారణమని చెప్పారు. వచన కవిత్వ విభాగంలో నందిని సిధారెడ్డి గారు రచించిన అనిమేష కవితా సంపుటికి పురస్కారం లభించడం అభినందనీయమన్నారు. ఆయన కలం నుంచి మరిన్ని మంచి రచనలు రావాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు.

## కౌంటర్ దాఖలుకు ఇదే చివరి అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

కోకాపేట భూములపై బీఆర్ఎస్‌కు హైకోర్టు స్పష్టీకరణ గడువు ఇస్తున్నామని స్పష్టంచేసింది. రూ.1100 కోట్ల విలువ చేసే భూమిని నామమాత్రపు ధరకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలైన పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ జరిపింది. వాదనలు విన్న ధర్మాసనం.. కాంగ్రెస్ పార్టీకి భూకేటాయింపులను పిటిషనర్లు ఎందుకు ప్రశ్నించలేదన్న వ్యాఖ్యకు స్పందించింది. రెండు తప్పులు ఒక్కటైనా అది ఒప్పు కాబోదని వ్యాఖ్యానించింది.

# దివ్యాంగులు, వృద్ధులకు ప్రతి నెల చివరి శనివారం ప్రత్యేక ప్రజావాణి

కలెక్టర్ బి. చంద్రశేఖర్




నల్లగొండ బ్యూరో, మార్చి 16 (వార్తా వేదిక సూర్య ) ఇక పై దివ్యాంగులు, వృద్ధులకు ప్రతి నెల చివరి శనివారం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 28 నుండి ఈ ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల వద్ద నుండి పీర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ తర్వాత జిల్లా అధికారులతో వివిధ అంశాల పై జిల్లా అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు వెళ్లాలని , ఈ వారంలో సామూహిక ఇందిరమ్మ గృహప్రవేశాలకు చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ పథకం కింద ఇంకా మొదలు పెట్టని పనులపై నివేదిక సమర్పించాలని, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు రెగ్యులర్గా తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించాలని, పదవ తరగతి పరీక్షలు సవ్యంగా జరిగేలా మండల ప్రత్యేక అధికారులు చూడాలన్నారు. రంజాన్ నేపథ్యంలో ప్రభుత్వం తరఫున రంజాన్ తోఫాల పంపిణీ, ఇఫ్తార్ ఏర్పాటుకు సంబంధిత శాసనసభ్యుల సమ్మతి తో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ నెల 22, 23 తర్వాత రబీ ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నందున మిల్లుల టాగింగ్ ,గ్రామ పంచాయతీల వారీగా ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరోసారి పరిశీలించి ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరాన్- ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో డొమెస్టిక్ ఎల్పిజి గ్యాస్ కొరత లేకున్నప్పటికీ ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని ,అయితే రెడ్కో తరఫున ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం డొమెస్టిక్ సిలిండర్లు 21 రోజుల నుంచి 45 రోజుల్లోపు సరఫరా చేయడం జరుగుతున్నదని, బ్లాక్ మార్కెటింగ్ చేయడం, డొమెస్టిక్ సిలిండర్లు వాణిజ్య పరంగా వినియోగించడం నేరమని, హాస్టల్లు, పాఠశాలల్లో ఎల్పిజి గ్యాస్ ఇబ్బంది రాకుండా చూసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జనవరి, ఫిబ్రవరి మాసాలలో మండల ప్రత్యేక అధికారులు హాస్టళ్ల తనిఖీ సందర్భంగా గుర్తించిన అంశాలన్నింటిని నివేదిక సమర్పించాలన్నారు.ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక అమలులో భాగంగా ఈనెల 6 నుండి 15 వరకు పరిశుభ్రత ,ఫైళ్ల పరిష్కారం చేయడం జరిగిందని, ఇందుకు సంబంధించి జిల్లా అధికారులందరూ వివరాలను స్ప్రెడ్ సీట్లో నివేదిక సమర్పించాలన్నారు. ఏప్రిల్ 2 న ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక గ్రామసభ నిర్వహించనున్న దృష్ట్యా ప్రతి అధికారి వారి శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి గ్రామపంచాయతీ వారిగా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవోలకు నివేదికలను సమర్పించాలని, ఈ నివేదికలను గ్రామ సభలలో చదివి వినిపించాలని ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్లు బయో మైనింగుకు చర్యలు తీసుకోవాలని , బయో మైనింగ్ కింద పనులు ప్రారంభించేందుకు ఇది వరకే ఏజెన్సీలను నిర్ణయించడం జరిగిందని, ఏజెన్సీలకు అవసరమైన స్థలం, నీరు, ఇతర సదుపాయాలను ఈ వారంలోగా కల్పించాలన్నారు.నగర అభివృద్ధికి గతంలో ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీ 15 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, ఇందుకు సంబంధించి పనుల వారిగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు ఈ- వేస్ట్ కింద తీసివేసిన ఈ- వేస్ట్ వివరాలను, అలాగే ఫైల్ మేనేజ్మెంట్ కు సంబంధించి క్లోజ్ చేసిన ఫైళ్ల నివేదిక ఇవ్వాలన్నారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, దేవరకొండ, చండూరు ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. కాగా ఈ సోమవారం రెవెన్యూకు 60 ఫిర్యాదులు, జిల్లా అధికారులకు 45 ఫిర్యాదులు వచ్చాయి.





## శ్రీ కుర్మేడు ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవంలో పాల్గొన బిఆర్ఎస్ నాయకులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భీల్యానాయక్

దేవరకొండ మార్చి 16 (వార్త వేదిక సూర్య ): చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడు ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భీల్యానాయక్ వారు మాట్లాడుతూ ఎంతొ కన్నుల పండువగా నిర్వహించే ఈ జాతర మహోత్సవంలో పాల్గోనడం శుభ పరిణామం అని అమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆనందంగా మెలగాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ చెన్నమ్మ లాలయ్య, మాజీ ఎంపీటీసీ శ్వేత శ్రీశైలం గౌడ్, అండేకార్ అశోక్, సాగర్‌రావు, నాదిరి రమేష్, కేతావత్ కిషన్ నాయక్, బీమయ్య, శ్రీకాంత్,నాదిరి శ్రీశైలం, జైపాల్ నాయక్, మోతిరాం, చిన్నులు పాల్గొన్నారు.



## ఏమిరెడ్డి అంతిరెడ్డి దశ దినకర్మలో పాల్గొని నివాళులు అర్పించిన బిఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్

దేవరకొండ మార్చ్ 16 (వార్త వేదిక సూర్య): పి ఏ పల్లి మండలం పరిధిలోని తిరుమల గిరి ప్రాంతానికీ చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏమిరెడ్డి అంతి రెడ్డి ఇటివలే మరణించారు వారి దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్ర పటానికి బిఆర్ఎస్ దేవరకొండ నియోజక వర్గ నాయకులు వడ్త్య రమేష్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏమిరెడ్డి జైహింద్ రెడ్డి.ప్రతాప్ రెడ్డి బిఆర్యస్ గ్రామ శాఖ అధ్యకులు భాషపక రవి.రాంరెడ్డి వెంకట్ రెడ్డి రాంరెడ్డి అంతి రెడ్డి. శివ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ నియామకం

రాజేంద్రనగర్ నాయకులకు కీలక పదవులు..

అత్తాపూర్‌లో ఘనంగా సన్మానం



మైలర్ దేవ్ పల్లి, మర్చి 16 ( వార్త వేదిక సూర్య ) : రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన కమిటీని సోమవారం ప్రకటించారు. ఈ నూతన కమిటీలో రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన సీనియర్ నాయకులకు సముచిత స్థానం దక్కింది. జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా కొమురయ్య, జిల్లా కార్యదర్శిగా మల్లేష్ యాదవ్, కార్యాలయ సెక్రటరీగా విజయ్ కుమార్, మరియు ఐటీ సెల్ కన్వీనర్‌గా వెంకటరమణ గుప్త నియమితులయ్యారు. జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు స్వీకరించిన ఈ నాయకులను అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ అగ్ర నాయకత్వం రాజేంద్రనగర్ నాయకత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో భారతీయ జనతా పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, రాబోయే ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగురవేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, నాయకులు సుధాకర్, రాజశేఖర్, రమేష్, జయానంద్ రెడ్డి, నరసింహ, కిట్టు, రాజు పైల్వాన్, వెంకటరెడ్డి, ఉమ, జి. శశికాంత్ శర్మ, రాము, అమర్ నాథ్ రెడ్డి, అమృత, విజయ్, స్వామి, లింగం, బాలకృష్ణ తదితరులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ

రాంబాగ్ పాఠశాల సందర్శన.. విద్యార్థుల అభ్యాస స్థాయిలపై ఆరా

15 రోజుల్లో మార్పు రావాలి: అధికారులకు నవీన్ నికోలస్ ఆదేశం



మైలర్ దేవ్ పల్లి,మర్చి 16 ( వార్త వేదిక సూర్య ) : రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ (ఐఏఎస్) సోమవారం రాజేంద్రనగర్ మండల పరిధిలోని రాంబాగ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలకు చేరుకున్న ఆయన, అక్కడి విద్యాబోధన తీరును స్వయంగా పరిశీలించారు. డైరెక్టర్ నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వారి అభ్యాస స్థాయిలను పరీక్షించేందుకు పలు ప్రశ్నలు వేశారు. విద్యార్థుల సమాధానాల ఆధారంగా బోధనా పద్ధతుల్లో మార్పులు చేయాలని, విద్యార్థుల ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవని అసహనం వ్యక్తం చేశారు. రాబోయే 15 రోజుల్లోపు విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను మెరుగుపరచాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన డైరెక్టర్, సంబంధిత స్కావెంజర్‌ను వెంటనే విధుల్లోంచి తొలగించాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు విద్యార్థుల ఆరోగ్యానికి అనుకూలంగా ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం, పాఠశాల భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో కేటాయించిన ప్రతిపాదిత స్థలాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కె. శంకర్ రాథోడ్ మరియు ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.





# ఉగాది రోజు షడ్రుచుల ప్రసాద నివేదన అరిషడ్వర్గాలు విడిచిపెట్టడానికి గుర్తు



దేవరకొండ మార్చి 16(వార్త వేదిక సూర్య ): మార్చి 19 న రాబోవు యుగాది పండుగ ను పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి వారు రచించినటు వంటి 100 ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను, మరియు త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను "త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక" నల్గొండ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం రోజు నల్గొండ జిల్లా, కొండ మల్లేపల్లె మండలం లోని చిన్నఅడిశెర్లపల్లె గ్రామంలోలి ఇంటింటా ప్రచారం చేయడం జరిగింది రాబోయే యుగాది పండుగ గొప్పతనం ను శాస్త్రబద్ధంగా వివరించడం జరిగింది.. భారత దేశంలో 6 ఋతువులు చాలా గొప్పగా ఉండేలా దేవుడు సృష్టించాడని. ఈ సకల చరా అచర ప్రకృతి లను సృష్టించిన ఆ దేవుడి పై భక్తి కలిగి ఉగాది రోజున సృష్టి కర్త అయిన పరమాత్మను కృతజ్ఞతతో ప్రార్థించి గుర్తు చేసుకోవాలి అని అన్నారు. యుగాది పండుగ ఆధ్యాత్మిక రహస్యం ఉగాది అంటే యుగానికి ఆది అని, దేవుని చేత ఆదివారం ఈ సృష్టి ఏర్పడింది కాబట్టి మొట్టమొదటి పండుగ యుగాది అని తెలిపారు పూర్వం ఉగాది రోజు ఆరు గుణాలకు ప్రతీకగా షడ్రుచుల ప్రసాదం ను తయారుచేసి దైవం ముందర ఉంచి మాలోని గుణాల మాయను తీసివేసి మోక్షానికి దగ్గర చేయమని ప్రార్థించేవారు.. తర్వాత భక్తితో ఉగాది ప్రసాదం ను స్వీకరించేవారు. అని తెలిపారు. యుగాది ప్రసాదం రాను రాను యుగాది పచ్చడి గా మారింది (ప్రసాదం అని పిలవడం పద్దతి గా ఉంటుంది) కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక-నల్గొండ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పగిడిమర్రి వెంకటేశం మేకల శ్రీనివాసులు, చంద్రమౌళి, రంగారెడ్డి, చక్రధర్, వెంకటమ్మ, కవిత, పార్వతమ్మలు పాల్గొన్నారు త్రైత సిద్ధాంతం- ప్రబోధసేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక - నల్గొండ కమిటీ అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశం.




## శివరాంపల్లిలో అధ్వాన్నంగా రోడ్లు..

పట్టించుకోని అధికారులు

మురుగునీరు, చెత్తాచెదారంతో విద్యార్థుల అవస్థలు

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

బీజేపీ నాయకుడు సామ రాహుల్ రెడ్డి డిమాండ్

మైలర్ దేవ్ పల్లి, మర్చి 16 (వార్త వేదిక సూర్య) : శివరాంపల్లి గ్రామంలోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (డి ఎం హెచ్ ఓ) కార్యాలయం నుండి శిశుమందిర్ పాఠశాల వరకు ఉన్న రహదారి సమస్యలపై స్థానిక బీజేపీ నాయకుడు సామ రాహుల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది కాలంగా ఈ రహదారి అత్యంత దారుణంగా దెబ్బతిని ఉన్నా, అధికారులు కనీసం పట్టించుకోకపోవడం విచారకరమని ఆయన మండిపడ్డారు. రహదారిపై పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలు, మురుగునీరు వల్ల స్థానికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా శిశు మందిర్ పాఠశాలకు వెళ్లే చిన్న పిల్లలు ప్రతిరోజూ ఈ బురద, దుర్వాసన భరిస్తూ వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల వారు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు చేపట్టాలని, లేని పక్షంలో స్థానిక ప్రజలతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన డిమాండ్ చేశారు.

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలి

ప్రపంచ శాంతి నెలకొల్పాలి

సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు



మైలర్ దేవ్ పల్లి, మర్చి 16 (వార్త వేదిక సూర్య) : ఇరాన్‌పై అమెరికా మరియు ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధ చర్యలను తక్షణమే ఆపి ప్రపంచ శాంతిని నెలకొల్పాలని సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ యుద్ధం కారణంగా దేశంలో గ్యాస్ మరియు పెట్రోలు కొరత ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ "యుద్ధం వద్దు - ప్రపంచ శాంతి ముద్దు" అనే నినాదాలతో శంషాబాద్ మండల కేంద్రంలో వంట గ్యాస్ పొయ్యిని చేతబట్టి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమం సిపిఐ మండల కార్యదర్శి నర్ర గిరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. గల్ఫ్ దేశాల్లోని ఆయిల్ నిక్షేపాలపై కన్నేసిన అమెరికా, అక్కడ ఉన్న ప్రభుత్వాలను కూలదోసి తమకు అనుకూల ప్రభుత్వాలను ఏర్పాటుచేయడానికి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. మాట వినని దేశాలపై దాడులు చేయడం దుర్మార్గమని, ఇరాక్‌పై జరిగిన దాడి దీనికి ఉదాహరణ అని ఆయన అన్నారు. ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధం ప్రభావంతో భారతదేశంలో గ్యాస్ మరియు పెట్రో ఇంధన కొరత తీవ్రంగా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితి భారత ప్రధానికి కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ఇలా యుద్ధం కొనసాగితే రాబోయే రోజుల్లో గ్యాస్, పెట్రో ఇంధనం మాత్రమే కాకుండా ఆహార ధాన్యాల కొరత కూడా ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆయన హెచ్చరించారు. అమెరికా ఆధిపత్యం కోసం జరుగుతున్న యుద్ధాలు ప్రపంచ ప్రజలకు నష్టం కలిగిస్తున్నాయని, పేద దేశాలు అమెరికా ధన దాహానికి బలైపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని, భారత ప్రభుత్వం తటస్థ వైఖరిని విడనాడి అమెరికాను ప్రశ్నించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. యాదగిరి, శంషాబాద్ మండల కార్యదర్శి నర్ర గిరి, ఏఐటియుసి మండల కార్యదర్శి గిలక రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు శ్రీను, ఏఐటియుసి నాయకుడు ప్రవీణ్ కుమార్ గౌడ్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరల పెంపుపై 'సిపిఐ' సమరభేరి

బుద్వేల్ చౌరస్తాలో భారీ నిరసన..

తక్షణమే ధరలు తగ్గించాలని డిమాండ్



మైలర్ దేవ్ పల్లి, మర్చి 16 (వార్త వేదిక సూర్య) : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా రాజేంద్రనగర్ మండల కేంద్రంలో సోమవారం ధర్నా నిర్వహించారు. మండల పార్టీ కార్యదర్శి కన్య నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో బుద్వేల్ చౌరస్తా వద్ద పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర నాయకులు, జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ.. సామాన్యుడి నడ్డి విరిచేలా గ్యాస్ ధరలను పెంచడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, గ్యాస్ భారాన్ని కూడా ప్రజలపై మోపడం సరికాదన్నారు. పెంచిన ధరలను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె. ఆనంద్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి జె. విజయ ఆనంద్ గౌడ్, మండల ఏఐటీయూసీ కార్యదర్శి సయ్యద్ కాజా, అధ్యక్షులు ఎండి సలీం, మండల కార్యాలయ కార్యదర్శి జి. సత్యం, వీరితో పాటు మండల కౌన్సిల్ సభ్యులు పాండు, సదానంద గౌడ్, మౌనిక, కె. వాణి, పుష్ప, శాలిని, శాంతమ్మ, ఎండి సాబీర్, ఇంద్ర, మణెమ్మ, జంగయ్యలు పాల్గొన్నారు.



## పోలీస్ గ్రీవెన్స్ డే లో ప్రజా సమస్యల ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్గొండ టౌన్ మార్చ్ 16 (వార్తా వేదిక సూర్య)**

నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 30 మంది బాధితులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి ప్రత్యక్షంగా వివరించారు. గ్రీవెన్స్ డే సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు సహా పలు అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ప్రజలు తెలిపిన సమస్యలను జిల్లా ఎస్పీ గారు విని, సంబంధిత పోలీస్ అధికారులకు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు న్యాయం జరిగే విధంగా ప్రతి ఫిర్యాదును సమగ్రంగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## సీఆర్పీల సమస్యలు పరిష్కరించాలి

**రాజేంద్రనగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత**

**13 ఏళ్లుగా సేవలు అందిస్తున్నా పట్టించుకోని సర్కారు**



**మైలర్ దేవ్ పల్లి, మర్చి 16 ( వార్త వేదిక సూర్య ) :**

రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో కీలక పాత్ర పోషిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల (సీఆర్పీ) సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఆర్పీ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం రాజేంద్రనగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బొమ్మ రాములు కి యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పోలే రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఆర్పీలు ఎదుర్కొంటున్న ఆర్థిక, వృత్తిపరమైన ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా పోలే రమేష్ మాట్లాడుతూ.. రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ఎంఎ, ఎంఎస్సీ, బీఈడీ, టెట్ వంటి ఉన్నత విద్యా అర్హతలు కలిగి ఉన్న తమను ప్రభుత్వం 13 ఏళ్ల క్రితం ఎంపిక చేసిందని గుర్తు చేశారు. గతంలో ఉపాధ్యాయులు నిర్వహించే ఎంఆర్పీ విధులను తాము నిర్వహిస్తున్నామని, బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడంలో తాము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లోనూ బోధన చేస్తున్న తమపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన డిమాండ్లు ఇవే: సీఆర్పీలను వెంటనే పర్మినెంట్ చేయాలి, అప్పటి వరకు కనీసం టైమ్ స్కేల్ అమలు చేయాలి. వీరి పేరును క్లస్టర్ రిసోర్స్ టీచర్లుగా (సీఆర్టీ) మార్చాలి. ఆరోగ్య భీమాతో పాటు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. విధి నిర్వహణలో ప్రమాదం జరిగితే రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. ప్రతీయేటా టెర్మినేషన్, బాండ్ అగ్రిమెంట్ వంటి నిబంధనలు లేకుండా స్వేచ్ఛగా విధులు నిర్వహించే అవకాశం ఇవ్వాలి. పాఠశాలల సందర్శన కోసం అయ్యే ప్రయాణ ఖర్చులకు ట్రావెలింగ్ అలవెన్సులు మంజూరు చేయాలి. ఉపాధ్యాయ నియామకాల్లో 30 శాతం వెయిటేజీ కల్పించడంతో పాటు, భార్యాభర్తల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని జిల్లా, అంతర్ జిల్లా బదిలీలకు అవకాశం కల్పించాలి. పదవీ విరమణ పొందే వారికి రూ. 20 లక్షల బెనిఫిట్స్ ప్రకటించాలన్నారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో సీఆర్పీలకు మెరుగైన వేతనాలు, గౌరవం దక్కుతున్నాయని, తెలంగాణలో కూడా అదే తరహాలో న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శివరాజ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## కోర్టులో కేసు నడుస్తున్న పోలీసుల వేధింపులు

**నల్లగొండ బ్యూరో, మార్చి 16 (వార్తా వేదిక సూర్య )**



కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ కౌన్సిలింగ్ పేరుతో పోలీసులు భయాందోళనకు గురిచేస్తున్నారని నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామానికి చెందిన సంధ శ్రవణ్ ఆరోపించారు. సోమవారం నల్లగొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022లో మిర్యాలగూడకు చెందిన దాసరి మౌనికతో తనకు వివాహం జరిగిందని ఆరు నెలల పాటు మంచిగానే కాపురం కొనసాగిందని తెలిపారు. నా భార్య సోదరుడైన దాసరి నరేష్ తన అక్కర నిమిత్తం తన వద్ద నుండి ఒక లక్ష పదివేల రూపాయలు అప్పుగా తీసుకున్నాడని అనుకున్న టయానికి నా డబ్బులు నాకు తిరిగి ఇవ్వలేదని ఈ సందర్భంలో తన భార్య పుట్టింటికి వెళ్లిందని డబ్బుల విషయంలో తనకు తన బామ్మర్దికి మధ్య గొడవ జరిగిందని తెలిపారు. కొన్ని రోజుల తర్వాత తన భార్య ను తన దగ్గర పంపించి డబ్బులు ఇస్తామని చెప్పి ఒక 50 మంది తన ఇంటి దగ్గరికి వచ్చి డబ్బులు ఇవ్వకుండా తనపై దాడి చేశారని ఆరోపించారు. ఇట్టి విషయంపై రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ తన ఫిర్యాదును తీసుకోకుండా తననే బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడికి వెళ్లిన తనకు న్యాయం జరగకపోవడంతో డిజిపి కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. మళ్లీ నన్ను మహిళా పోలీస్ స్టేషన్ పిలిపించి తనను విపరీతంగా కొట్టారని అన్నారు. డీజీపీకి, హెచ్ ఆర్ సి కి ఫిర్యాదు చేసిన తమకు న్యాయం జరగలేదని తెలిపారు. పోలీసుల నుంచి వేధింపులు తాళలేక తనకు తన భార్య నుండి విడాకులు కావాలని కోర్టులో చేసి వేయడం జరిగిందని కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ నల్లగొండ, మిర్యాలగూడ పోలీసులు 498 కేసులు అని చెప్పి భయాందోళనలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులో కేసు పెండింగ్లో ఉంటే 498 కేసును ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. తన బామ్మర్దుల నుండి ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ లు కౌన్సిలింగ్ ల పేరుతో తనను ఇబ్బందులకు గురి చేస్తున్న పోలీసుల పైన చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జాలే నరసింహారెడ్డి



**దేవరకొండ మార్చ్ 16 (వార్త వేదిక సూర్య ):**

సోమవారం రోజున చందంపేట మండలంలోని పోలేపల్లి గ్రామానికీ చెందిన ఇప్ప తిరుపతి రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేపించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన పి సీ సీ సభ్యులు పిఏసిఎస్ మాజీ చైర్మన్ జాలే నరసింహా రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, వెంకులు, నిరంజన్, శ్రీను, ఆంజనేయులు, మరియు తదితరులు పాల్గొన్నారు.









# కల్తీ 'లడ్డు' గుట్టు రట్టు

- మైలార్‌దేవ్‌పల్లిలో పోలీసుల మెరుపు దాడులు
- నిషేధిత రసాయనాలు, గడువు తీరిన ఫ్లేవర్లతో స్వీట్ల తయారీ
- అపరిశుభ్ర వాతావరణంలో 'లక్కీ ఫుడ్స్', 'జీ ఫుడ్స్' దందా
- రూ. 1.10 లక్షల విలువైన పదార్థాల సీజ్.. ఇద్దరు నిందితుల అరెస్ట్

**మైలర్ దేవ్ పల్లి, మర్చి 16 ( వార్త వేదిక సూర్య ) :**

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తున్న ముఠా గుట్టును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు రట్టు చేశారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో భారీగా కల్తీ స్వీట్లు, ప్రమాదకర రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాన్ కాలనీలో ఉన్న 'లక్కీ ఫుడ్స్' కంపెనీపై, అలాగే లక్ష్మిగూడలోని 'మెస్సర్స్ జీ ఫుడ్స్' కేంద్రంపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ కేంద్రాల్లో అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో, ఎటువంటి అనుమతులు లేకుండా ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదకర రసాయనాల వినియోగం: తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేయగా.. గడువు తీరిన వెనిల్లా ఫ్లేవర్, సోడియం బెంజోయేట్ వంటి రసాయనాలను స్వీట్లలో వాడుతున్నట్లు తేలింది. వీటి వినియోగం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 98 బాక్సుల మోతీచూర్ లడ్డులు, 35 కిలోల లడ్డు మిశ్రమాన్ని పోలీసులు సీజ్ చేశారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 1.10 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఇద్దరి అరెస్ట్ ఈ అక్రమ తయారీకి బాధ్యులైన అబ్దుల్ హక్, మహమ్మద్ ఖమరుద్దీన్ అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిబంధనలు అతిక్రమించి ప్రజల ప్రాణాలతో ఆడుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. కల్తీ రహిత సమాజం కోసం ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద తయారీ కేంద్రాల సమాచారాన్ని పోలీసులకు అందించాలని వారు కోరారు.



## కార్మిక హక్కుల రక్షణకై పోరాడుతాం

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడిగా దండంపల్లి సత్తయ్య, సహాయ కార్యదర్శిగా అవుట రవీందర్‌లు ఎన్నిక**

**నల్లగొండ బ్యూరో, మార్చి 16 (వార్తా వేదిక సూర్య )**

కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై నికరంగా పోరాడుతామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, సహాయ కార్యదర్శి అవుట రవీందర్ లు ఒక ప్రకటనలో తెలిపారు. శని,ఆదివారాలలో నల్గొండ పట్టణంలో ఎస్వీఐ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సిఐటియు 13వ జిల్లా మహాసభలో నల్గొండ పట్టణానికి చెందిన దండెంపల్లి సత్తయ్య జిల్లా ఉపాధ్యక్షులుగా, అవుట రవీందర్ జిల్లా సహాయ కార్యదర్శిగా, కార్యవర్గ సభ్యులుగా భీమగాని గణేష్ (తిప్పర్తి మండల కన్వీనర్) పోలే సత్యనారాయణ (నల్గొండ మండల కన్వీనర్) నెలగొందరాసి లింగయ్య (కనగల్ మండల కన్వీనర్) అద్దంకి నరసింహ (ట్రాన్స్పోర్ట్ రంగం) జంజరాల శ్రీనివాస్ (మిషన్ భగీరథ) నలపరాజు సైదులు (ఎల్ఐసి రంగం) సలివోజు సైదాచారి (భవన నిర్మాణ రంగం) చింతకాయల సంతోష్ (మున్సిపల్ రంగం) సుంకరబోయిన వెంకన్న (హమాలి రంగం) గంజి రాజేష్ (పవర్లూమ్ రంగం) సిహెచ్ అనురాధ (శ్రామిక మహిళ) లు ఎన్నికైనారని తెలిపారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆశ అంగన్వాడి ఐకెపి వివోఏలకు కనీస వేతనం 18000 అమలు చేయాలని అమాలి ట్రాన్స్పోర్ట్ రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు ఇస్తున్న సంవత్సరానికి 12000 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి తెచ్చిన నాలుగు లేబర్ కోర్టులను వెంటనే రద్దు చేయాలని 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానం రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక పోరాటాలపై జరుగుతున్న నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రజలు ప్రజాతంత్ర వాదులు ముక్తకంఠంతో ఖండించాలని విజ్ఞప్తి చేశారు.







## భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, సీహెచ్ ఇంద్రలకు సన్మానం

**మైలర్ దేవ్ పల్లి, మర్చి 16 (వార్త వేదిక సూర్య) :**

మణికొండ మరియు నెక్నాపూర్ డివిజన్లలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి. అంజన్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షులు కే. నరేందర్ రెడ్డి మరియు సీహెచ్. ఇంద్రలను మణికొండ మున్సిపాలిటీ భారతీయ జనతా పార్టీ శాఖ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాలు మరియు ప్రజా సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మణికొండ మరియు నెక్నాపూర్ డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








## కొంతం నర్సింగ్‌రావు 10వ రోజు సెరిమోని కార్యక్రమంలో బీజేపీ నేతలు

**సికింద్రాబాద్, మార్చి 16(వార్త వేదిక సూర్య)**



మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ మామ కొంతం నర్సింగ్ రావు 10వ రోజు సెరిమోని సోమవారం శ్రీ రాజ రాజేశ్వరి కన్వెన్షన్ డైమండ్ పాయింట్ సిక్ విలేజ్ లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు కొంతం నర్సింగ్ రావు చిత్రపటానికి ఘనంగా పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల నరసింహ రెడ్డి, ఆకుల శ్రీవాణి, రాజ్యలక్ష్మీ, బండారు శ్రీవాణి, శ్రవణ్, కంటోన్మెంట్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ వంశీ తిలక్, బీజేపీ నాయకులు ధనుంజయ్, ఠాకూర్, రామకృష్ణ, పెద్ది రవి, బిఎన్ శ్రీనివాస్, ముట్ట జై సింహ, క్రిశాంక్, కాంగ్రెస్ నేతలు గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## ఎం.జీ.యులో ఎస్ఎఫ్ఐ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

**నల్లగొండ బ్యూరో, మార్చి 16 (వార్తా వేదిక సూర్య )**

మార్చి 17 న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులు కర్రెమ్ రవికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కుల సాధన కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం,వాటి పరిష్కారం కోసం పోరాటాన్ని బలపరచడమే ఈ కన్వెన్షన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో విద్యా వ్యవస్థ పలు సమస్యలతో సతమతమవుతోందని ఆయన అన్నారు. ఫీజుల పెంపు, హాస్టల్ సౌకర్యాల లోపం, మెస్ చార్జీల పెరుగుదల, ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులు, సరైన గ్రంథాలయాలు మరియు ప్రయోగశాలల లేమి వంటి సమస్యలు విద్యార్థులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉన్నత విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మార్చి 17న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ బహిరంగ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల ఐక్యతతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ నాయకులు సంపత్ సౌమ్య అమూల్య స్వాతిక తదితరులు పాల్గొన్నారు మరియు విద్యార్థులు పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

## మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**సికింద్రాబాద్, మార్చి 16(వార్త వేదిక సూర్య)**

సీతాఫలమండి లోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్లో మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గాయకురాలు మధుప్రియ మరియు రేలారే గంగా ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళలు సమాజ అభివృద్ధిలో పోషిస్తున్న కీలక పాత్రను అతిథులు ప్రస్తావించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుతున్నారని కొనియాడారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సామల హేమ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తూ సమాజ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్నారని తెలిపారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని ఆమె అన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం మరియు సమాజం కలిసి పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది శైలజ, జోనల్ కమిషనర్ మంగతాయారు, జిహెచ్ఎంసి, ఏస్ సి అశలత,ఈ ఈ సువర్ణ, సి ఓ ధనుశ్రీ, ధనుంజయ గౌడ్, గాయకురాలు మధుప్రియ, రేలారే గంగా, గీత సింగ్, సికింద్రాబాద్ నియోజకవర్గ మహిళ నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలి

**జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్**




**నల్లగొండ బ్యూరో, మార్చి 16 (వార్తా వేదిక సూర్య )**

సోమవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ, తెలంగాణ మైనారిటీస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, మేయర్ ల చేతుల మీదుగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద 40 రోజులపాటు కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 56 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో నల్గొండకు 1152 కుట్టుమిషన్లు వచ్చాయని, మొదటి విడతన 56 మందికి 100 శాతం సబ్సిడీతో ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 10,000 రూపాయల విలువ గల కుట్టు మిషన్ తో పాటు, ఎలక్ట్రికల్ మిషన్ ను మహిళలకు పంపిణీ చేస్తున్నామని ,తక్కినవి విడతలవారీగా పంపిణీ చేస్తామని తెలిపారు. కుట్టు మిషన్లు పొందిన మహిళలు వాటిని ఖాళీగా ఉంచకుండా పని చేసుకోవాలని, తద్వారా ఆదాయం వస్తుందని, ఇది కుటుంబాలకు ఉపయోగపడుతుందని కలెక్టర్ అన్నారు. సెట్విన్ ద్వారా కూడా మహిళలకు బ్యూటిషన్, టైలరింగ్ ,వివిధ కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని, ఇందిరా మహిళ శక్తి కింద అనేక పథకాలు ఉన్నాయని, మైనార్టీ మహిళలు చదువుకుని, శిక్షణ పొంది ఈ ఆకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు స్వయం సహాయక సంఘాలలో చేరితే ప్రభుత్వం ద్వారా రుణాలు వస్తాయని చెప్పారు.మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో కుట్టు మిషన్లు కావడం జరిగిందని, ఇందిరా మహిళా శక్తి కింద 40 రోజులపాటు శిక్షణ తీసుకొని మిషన్లు పొందిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెట్విన్ ద్వారా కుట్టుమిషన్లతోపాటు, ఇతర కోర్సులలో శిక్షణ ఇస్తున్నారని,వాటిని కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి విజయేందర్ రెడ్డి లు, కార్పొరేటర్లు మాట్లాడారు. కాగా కుట్టు మిషన్ శిక్షణ పొందిన లబ్ధిదారురాలు మాట్లాడుతూ.. 40 రోజులపాటు కుట్టు మిషన్ల పై శిక్షణ పొందడమే కాకుండా, తనకు కుట్టు మిషన్ ఇవ్వడం పట్ల చాలా సంతోషంగా ఉందని, ఇందుకు ఆమె ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ రవీందర్ రెడ్డి,కార్పొరేటర్లు, తదితరులు ఉన్నారు.అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మేయర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ మహిళల అభివృద్ధికి పంపిణీ చేసిన కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

**నల్గొండ టౌన్ మార్చ్ 16 వార్త వేదిక సూర్య)**

నల్గొండ పట్టణంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నల్గొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని సుమారు 50 వేల విలువగల 2 కిలోల గంజాయి, రెండు మోటార్ సైకిళు ,, నాలుగు స్మార్ట్ మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో 15 మార్చి 2026న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో నల్గొండ పట్టణ శివారు ప్రాంతమైన మునుగోడు రోడ్డు గణేష్ నగర్ కాలనీ శ్మశాన వాటిక సమీపంలో కొంతమంది గంజాయి తాగుతూ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో డీఎస్పీ శివరాం రెడ్డి గారి నేతృత్వంలో నల్గొండ వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆకస్మిక దాడి నిర్వహించారు. దాడిలో హైదరాబాద్‌లోని ధూల్‌పేట్ ప్రాంతం నుండి గంజాయిని అక్రమంగా తెచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి స్థానిక యువతకు, విద్యార్థులకు విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు




పట్టుకున్నారు. అరెస్టు అయినవారు మహమ్మద్ ఫుర్ఖాన్ (19), కారింగుల ప్రదీప్ (22), వల్కి వినోద్ కుమార్ (26), బైరుగోండ నవీన్ (24)గా గుర్తించారు. నిందితుల వద్ద నుంచి సుమారు 2 కిలోల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు, నాలుగు స్మార్ట్ మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై నల్గొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.72/2026 ఖ/సావష. 8(జ) తీ/ష 20(ఎ)(ఙఙ)(దీ), 27(ఖ) శీట చీణూూాూాఖ్-1985 గా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివరాం రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు, రవాణా, విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇప్పటికే కళాశాలు, పాఠశాలలు, హాస్టళ్లు,నిర్మానుష ప్రాంతాలలో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎవరైనా అక్రమ గంజాయి విక్రయించిన, సేవించిన అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని, ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కేసును నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి గారి పర్యవేక్షణలో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుబడించిన నల్గొండ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు కే. సతీష్, బి. లచ్చి రెడ్డి మరియు సిబ్బంది లింగరెడ్డి, శ్రీనివాస ప్రసాద్, అంజయ్య, సైదులు లను జిల్లా ఎస్పీ గారు అభినందించారు.



## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు: తహశీల్దార్



**మోత్కూరు, మార్చి 16 (వార్తా వేదిక సూర్య);**

మతసామారస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని తహశీల్దార్ పి. జ్యోతి అన్నారు. సోమవారం మున్సిపల్ కేంద్రంలోని డ్రైవర్ కాలనీ ప్రభుత్వం పక్షాన ముస్లింల కు ఇచ్చిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజంలో మతసామరస్యాన్ని ఐక్యతను పెంపొదించి పరమావధిగా సాగే పవిత్ర మాసం రంజాన్ అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా మండు తుండటంతో ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ వెంకటేశ్వర రెడ్డి, ఆర్ఐ సుమన్, వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, గడ్డం స్వప్న, వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న గుప్తా, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి, అవిశెట్టి ఆవిలిమల్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, మహమ్మద్ సమీర్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భిల్యా నాయక్



**దేవరకొండ మార్చి 16(వార్త వేదిక సూర్య):**

చింతపల్లి మండల పరిధిలోని దైర్య పూరి తండాకు చెందిన రమావత్ బుజ్జి, రాములు నాయక్ కుమారుడు పవన్ కుమార్ సంతొషల రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భిల్యా నాయక్ ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అనిత దాసు నాయక్,చందర్ నాయక్, బిచ్య నాయక్,బిచ్చు నాయక్,మోతిరాం నాయక్, జైపాల్ నాయక్,రామ నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకు అంకితమైన యువ నాయకుడికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**అల్లాపురం గ్రామ ప్రజలు**



ప్రజా సేవకు అంకితమైన యువ నాయకుడు నేడు వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్న అర్థ వెంకట్ రెడ్డి - పల్లవి దంపతులకు అల్లాపురం గ్రామ ప్రజలు ఒక ప్రకటనలో పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవే లక్ష్యంగా అనునిత్యం ప్రజల్లో ఉంటూ అందరిలో ఒక్కడిగా కలిసిపోతూ నాయకత్వం అంటే సేవ అని నిరూపిస్తున్న యువ కెరటం చౌటుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్థ వెంకట్ రెడ్డి దంపతులు కలకాలం కన్నుల పండుగగా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఇలాంటి వివాహ వార్షికోత్సవాలను సరళ మైసమ్మ అమ్మవారి ఆశీర్వాదంతో ఆనందంగా జరుపుకోవాలని ప్రార్థిస్తున్నామని వారు తెలిపారు. వారి దాంపత్య ప్రేమ వికసిస్తూనే ఉండి, వారి చుట్టూ ఉన్న వారందరికీ ఆనందాన్ని తీసుకురావాలి. రాబోయే రోజుల్లో రాజకీయాలలో ఉత్తమమైన పదవులను పొంది మరిన్ని వార్షికోత్సవాలు జరుపుకోవాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నామని వారు తెలిపారు.

## భూమిని కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**వలిగొండ:మార్చి 16 (వార్తా వేదిక సూర్య)**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో గౌరెల్లి నుండి భద్రాచలం రోడ్డుకు భూమి కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించాలని గౌరవెల్లి నుండి భద్రాచలం రోడ్డు భూ బాధితులు మల్గారవీందర్ ఆధ్వర్యంలోధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ప్రొద్దుటూరు, ఎదుల్లగూడెం, మాందాపురం, నాతల్లగూడెం, దాసిరెడ్డిగూడెం మల్లేపల్లి, లోతుకుంట, సంగెం, వర్కట్పల్లి, రైతులు పాల్గొన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి టిఆర్ఎస్ నాయకులు పూర్తి మద్దతు తెలిపారు. మాజీ ఎంపీటీసీ పల్సంరమేష్, మాజీ జడ్పిటిసి మెగ్గుల శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి , టేకుల సోమవారం సర్పంచ్ పడమటి మమత, సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగిస్వామి, మాట్లాడుతూ.. గౌరెల్లి భద్రాచలం రోడ్డు భూ బాధితులకు బహిరంగ మార్కెట్ రేట్ ప్రకారం మూడింతల నష్టపరిహారాన్ని ఇవ్వాలని అన్నారు. రైతులు మల్గా సత్యనారాయణ, మల్గా వెంకటేశం, భీమిడి మల్లారెడ్డి, నారీ రమేష్ ,కోనపురి శ్రీశైలం, దేవరపల్లి భూపాల్ రెడ్డి ,రాపోలు గోపి ,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## నల్గొండ జిల్లా కలెక్టరేట్ ముందు ఐకెపి వివోఏ ఉద్యోగుల ధర్నా

**దేవరకొండ మార్చి 16( వార్త వేదిక సూర్య ):**

తెలంగాణ రాష్ట్ర ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ ) పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా వివోఏలు ఆందోళన బాట పట్టారు. దీనిలో భాగంగా నల్గొండలో కూడా భారీ ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. కలెక్టరేట్ ముట్టడి సమ్మెలో భాగంగా మార్చి 16న (బుధవారం) నల్గొండ జిల్లా కలెక్టరేట్‌కు భారీ పాదయాత్రగా చేరుకుని వినతిపత్రం అందజేశారు.

**ప్రధాన డిమాండ్లు :**

కనీస వేతనం వివోఏల జీతాన్ని నెలకు 26,000 కు పెంచాలి. ఉద్యోగ భద్రత: వారిని సెర్ప్ (సెర్ప్ ) ఉద్యోగులుగా గుర్తించాలి. పాత జీవోల రద్దు: '3 నెలల రెన్యూవల్' విధానాన్ని జీవో నంబర్ 58ని రద్దు చేయాలి.సదుపాయాలు గ్రూపు ఇన్సూరెన్స్ (10 లక్షలు), స్మార్ట్ ఫోన్లు లేదా ల్యాప్‌టాప్‌లు ఆన్‌లైన్ పని భారాన్ని తగ్గించాలి. నేపథ్యం:గత కొద్ది రోజులుగా నల్గొండ లోని టిటిడి కళ్యాణ మండపం వద్ద వివోఏలు సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరసన తెలుపుతున్నారు. సిఐటియు (సీఐటీయూ ) ఇతర కార్మిక సంఘాలు ఈ ధర్నాకు పూర్తి మద్దతు ప్రకటించాయి. గ్రామాల్లో మహిళా సంఘాల ( ఎస్ హెచ్ జి ) అభివృద్ధి కోసం పని చేస్తున్న తమపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, కేవలం స్వల్ప వేతనాలతో శ్రమ దోపిడీ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం, వివోఏ జిల్లా గౌరవ అధ్యక్షులు చిన్న పాక లక్ష్మీనారాయణ, వివోఏ ల జిల్లా అధ్యక్షులు చిలుముల దుర్గయ్య, కార్యదర్శి టీ.సులోచన, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.వెంకన్న, జిల్లా సహాయక కార్యదర్శి రామావత్ రాజు, మంగ,అన్ని మండలాల అధ్యక్షులు, వివో ఏలు, తదితరులు పాల్గొన్నారు.

## బదిర విద్యార్థులకు ఎస్ఐ రమేష్ అయిదు వేలు ఆర్థిక సహాయం

**విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఆడాలి : ఎస్సై అజ్మీరా రమేష్**



**దేవరకొండ, మార్చి 16 (వార్తా వేదిక సూర్య ):**

బధిర విద్యార్థులు తమ అంగవైకల్యాన్ని మరచి ఆత్మస్థైర్యంతో ఆడాలని కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీర రమేష్ అన్నారు. సోమవారం తెలంగాణ సోలిడార్ బదిరిల ఆశ్రమ పాఠశాల క్రీడా విద్యార్థులకు 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. సోలిడార్ తెలంగాణ బదిరుల పాఠశాల విద్యార్థులు 15 మంది జాతీయ స్థాయిలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ లో నిర్వహిస్తున్న టోర్నమెంట్ కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను అభినందించి ఖర్చుల నిమి త్తం ఐదువేల రూపాయలు అందించారు.

ఎస్సై అజ్మీరా రమేష్ దయా హృదయం తో సహకరించినందుకు నిర్వాహకులు దార్ల భాస్కర్ తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సురేష్, వినోద్, శివ,హేము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వం వైఫల్యంతోనే చమురు సంక్షోభం

**అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతోనే యుద్ధం**

**పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను కేంద్రం నియంత్రించాలి**

**సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి**




**దేవరకొండ మార్చి 16 (వార్తా వేదిక సూర్య ):**

సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వైఫల్యంతోనే దేశంలో చమురు సంక్షోభం నెలకొందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి విమర్శించారు. సోమవారం గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలని, చమురు సంక్షోభాన్ని నివారించాలని యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ కొండమల్లేపల్లి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నేడు నెలకొన్న ఈ సంక్షోభం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దూరదృష్టి లేని విధానాలు, తప్పుడు ప్రాధాన్యతల యొక్క ప్రత్యక్ష ఫలితం అన్నారు. ప్రభుత్వం తన విదేశాంగ విధాన ఎంపికల పరిణామాలను, భారతదేశ ఇంధన భద్రత, సరఫరాపై వాటి ప్రభావాన్ని అంచనా వేయడంలో విఫలమైందన్నారు. వినియోగదారులను రక్షించడానికి బదులుగా, ఆ భారాన్ని పూర్తిగా ప్రజలపై పడేలా చేసిందని, ఈ వైఫల్యాల పరిణామాలను ఎదుర్కోలేక, ప్రధానమంత్రి ఉపశమనం కల్పించడం కంటే ప్రతిపక్షంపై దాడి చేయడంలో బిజీగా ఉన్నారని అన్నారు. ఎల్పీజీ ధరల పెరుగుదలను, లక్షలాది మంది సాధారణ కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టి పెరుగుతున్న సరఫరా కొరతను భారత కమ్యూనిస్ట్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గృహ సిలిండర్లపై రూ. 60, వాణిజ్య సిలిండర్లపై రూ. 115 పెరుగుదలతో పాటు అనేక ప్రాంతాలలో లభ్యత లేకపోవడంతో, వంట గ్యాస్ పొందడానికి ప్రజలు మండే ఎండలో పొడవైన క్యూలలో నిలబడవలసి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్పీజీ శ్రామిక కుటుంబాలకు ఒక ప్రాథమిక అవసరం అయినప్పటికీ మోడీ ప్రభుత్వ వైఫల్యంతో దానిని రోజువారీ పోరాటంగా మార్చిందన్నారు. వాణిజ్య సిలిండర్లపై ఆధారపడిన చిన్న తినుబండారాలు, టీ స్టాళ్లు, ధాబాలు, రెస్టారెంట్లపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. అలాగే అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతోనే యుద్ధం కొనసాగుతుందని, యుద్ధాన్ని నివారించడానికి భారత్ తో సహా ప్రపంచ దేశాలు కృషి చేయాలని అన్నారు. భారత దేశం చమురు కొనుగోలు చేయడానికి అమెరికా సహా ఏ దేశం అనుమతి అవసరం లేదని, ఈ విషయంలో భారత దేశం సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం చేయాలని చూస్తుందని ఆరోపించారు. సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ యుద్ధం వల్ల ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరుగుతుందని దేశాల మధ్య అంతరాలు పెరుగుతాయని అన్నారు. ప్రపంచము శాంతి యుతంగా ఉండాలని యుద్ధాలు వద్దని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల వలన పేద మధ్యతరగతి వర్గాల ప్రజల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర రెడ్డి సహాయ కార్యదర్శి పెరికేటి శేఖరాచారి పట్టణ కార్యదర్శి సోమ్లా నాయక్ మండల నాయకులు పన్నల శ్రీనివాస్, కల్లు చరణ్ రెడ్డి, వీరస్వామి, ధర్మయ్య, వెంకటయ్య, యాదయ్య నగేష్ మధు ఏఐటీయూసీ మండల అధ్యక్షులు సోమ్లా నాయక్, ఎఐటియుసి మండల కార్యదర్శి ఆకులపల్లి వెంకటయ్య, శంకర్, హథీరాం శ్రీను మోతిలాల్,పాల్గొన్నారు. అనంతరం ఎమ్మార్వో గారికి మెమోరాండం ఇవ్వడం జరిగింది.

## సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన



**యాదగిరిగుట్ట మార్చి 16 (వార్త వేదిక సూర్య) :**

ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు దాడులు ఆపాలని, గ్యాస్ కొరతలు నివారించాలని ఈరోజు యాదగిరిగుట్ట పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరు రాజయ్య, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం ట్రంపు నియంతృత్వ విధానాల వలన ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు చేయడం సరైనది కాదని శాంతి చర్చల ద్వారా సమస్యలను పరిష్కారం చేసుకునేటువంటి అవకాశం ఉన్నప్పటికీ ఇటువంటి చర్యలు సరైనవి కావని,ఇదే విధానాలు కొనసాగితే రాబోయే రోజులలో హిట్లర్ కు పట్టిన గతే ట్రంప్‌కు పడుతుందని అన్నారు. ఇప్పటికైనా ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని దాడులు ఆపాలని ప్రపంచ శాంతి వర్ధిల్లాలని అన్నారు.ఈ దాడుల వలన మనదేశంలో కూడా డీజిల్,పెట్రోలు, గ్యాస్ కొరతలు ఏర్పడుతు ఉన్నాయని, దీనివలన ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, తక్షణమే ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, మండల కార్యవర్గ సభ్యులు పెరబోయిన పెంటయ్య, పెరబోయిన బంగారి, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి ఆరే పుష్ప, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, గీతా, గుండు వెంకటేష్, మర్రిగూడెం సర్పంచ్ బోదాస్ స్వప్న జగన్, యాదగిరి,మద్దూరు భాగ్యమ్మ,రావుల విజయలక్ష్మి,బోదాసు స్వామి, మీసాల దాసు తదితరులు పాల్గొని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.

## చిన్నారి తేజశ్రీని ఆశీర్వదించిన మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న



**మోత్కూరు, మార్చి 16 (వార్త వేదిక సూర్య ):**

మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ స్రవంతి దంపతుల చిన్న అమ్మాయి బుర్ర తేజశ్రీ పుట్టినరోజు సందర్భంగా సోమవారంజరిగిన పుట్టినరోజు వేడుకలకు మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న హాజరై చిన్నారి తేజశ్రీని ఆశీర్వదించారు. వెంకన్న మాట్లాడుతూ తేజశ్రీ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బొమ్మగాని నరేష్, రాములమ్మ రజిత అనుష, చిన్నారులు బుర్ర పృథ్వీక, కీర్తిక అర్జున్‌లు పాల్గొన్నారు.



## నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భీల్యానాయక్

దేవరకొండ మార్చ్ 16(వార్తా వేదిక సూర్య )

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో తీదేడు గ్రామానికి చెందిన వార్డు సభ్యులు గంటేల అలివేలు, సోమయ్య నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్,కేతావత్ భీల్యానాయక్ ఈ కార్యక్రమంలో తీదేడు సర్పంచ్ స్వప్న శేఖర్ రెడ్డి,లచ్చి రెడ్డి, గోవర్ధన చారి, కిరణ్, వెంకటేశ్వర్లు,సత్తయ్య, జైపాల్ నాయక్,మోతిరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బియ్యం అందజేసిన బీర్ల ఫౌండేషన్



మోటకొండూరు/వార్త వేథిక సూర్య :

మోటకొండూర్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన గాదెగాని రవి నాన్న క్రీ॥శే॥ గాదెగాని సిద్దయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యా సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బిర్ల అనితమ్మ తరుపున 50 కిలోల బియ్యంను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరెగూడెం సర్పంచ్ మరియు గ్రామ శాఖ అధ్యక్షులు పేరబోయిన దివ్య మకరజ్యోతి కార్తీక్ ఉపసర్పంచ్ కొల్లూరి లత నాగరాజు, ఉపాధ్యక్షులు పేరబోయిన చంద్రయ్య,కొల్లూరి సంజీవ, కార్యదర్శి బొల్ల వెంకటేష్,మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు కొల్లూరి అంజనేయులు మోటకొండూర్ మండల సోషల్ మీడియా కొల్లూరి హరిబాబు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పుల్లే భాస్కర్,మారబోయిన పద్మ పాండు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,పేరబోయిన శ్రీనివాస్,కొల్లూరి మహేందర్,పేరబోయిన కర్ణాకర్,పేరబోయిన శేంకర్ కొల్లూరి జానీ ప్రసాద్,పేరబోయిన పద్మనాభం,గాదెగాని మని,గాదెగాని జేశ్వంత్ మరియు గ్రామస్థులు గాదెగాని మాణిక్యం తదితరులు పాల్గొన్నారు..

## పల్లెర్ల ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు



ఆత్మకూరు (ఎం), మార్చి 16(వార్త వేదిక సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో స్వపరి పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు అధికారులుగా ప్రజా ప్రతినిధులుగా ఉపాధ్యాయులుగా వివిధ రకాల హోదాలో తమదైన శైలిలో అద్భుతమైన ప్రతిభను చూపించారు జిల్లా కలెక్టర్ గా సంఘ పాక పవిత్ర ఎంఈఓ వస్తువుల సమీర్ డిఇఓ ఎడ్ల సందీప్ తెలుగు టీచర్ పిఈటి మేడి యశ్వంత్ తేజ హెడ్మాస్టర్ క్రితిక్ తేజ మ్యాస్ టీచర్ సంఘపాక రాహుల్ ఇంగ్లీష్ టీచర్ మేడి మాధవి డ్యాన్స్ టీచర్ కొమ్ము కృతిక ఇంగ్లీష్ టీచర్ లుగా మేడి మల్లికార్జున్ ఈ ఒక్కరోజు తమ పాఠశాలకు వారే ఉపాధ్యాయులుగా సమర్థ వర్ధంగా వారి వారి హోదా వీధులు నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జామ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు విద్యార్థులకు స్వపరిపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత జన్నపాల మానస స్కూల్ అటెండర్ వస్తువుల శివమ్మ పేరెంట్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







# వంద పడకల ఆసుపత్రిని పూర్తి చేయాలని ధర్నా కలెక్టర్‌కు వినతి

గోశిక కరుణాకర్ సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి

చౌటుప్పల్ మార్చి 16 వార్తా వేదిక సూర్య

చౌటుప్పల్ లోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి, వైద్యులను నియమించి, త్వరగా వైద్య సేవలు అందించాలని సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చౌటుప్పల్ లోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా, కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చౌటుప్పల పరిసర ప్రాంతాల లో 8 మండలాల ప్రజలు చౌటుప్పల్ ప్రాంతం నుండి హైవే రోడ్డు ఉండడంవల్ల, అనేక వాహన ప్రమాదాలు జరుగుతుండడంతో, ఇటు ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యము లేక, అటు హైదరాబాదుకు వెళ్లి ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేక ఆర్థిక భారం తో సరైన సమయానికి ఆసుపత్రికి చేరలేక మరణించడం జరుగుతుంది. ఆ ఉద్దేశంతోనే గత ప్రభుత్వం 36 కోట్ల తో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించడం జరిగింది. కానీ ప్రభుత్వం మరియు అధికారుల నిర్లక్ష్యం వల్ల సంవత్సరాలు గడుస్తున్న ఆస్పత్రి ప్రారంభానికి నోచుకోలేక పోతుందని అన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వంద పడకల ఆసుపత్రిని నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి అన్ని రకాల వైద్యులను, నియమించి వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ ధర్నా లో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, అవ్వా రి రామేశ్వరి, చౌటుప్పల్ 16వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాసు, నాయకులు బండారు నరసింహ ,బత్తుల దాసు, ఆదిమూలం నందీశ్వర్, ఆకుల ధర్మయ్య, కందగట్ల ఆనంద్, సప్పిడి శ్రీనివాసరెడ్డి, చికూరు ఈ దయ, ముగదాల రాములు, ఎండి జానీ, సోమరాజ్, యాదయ్య, పంతంగి సంధ్య సుర్వి వెంకటేష్ యాదమ్మ సుర్వి జయమ్మ పాల్గొనడం జరిగింది.

# ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్న టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

కొండాపూర్ మండలం మల్కా పూర్, సంగారెడ్డి మున్సిపాలిటీ పోతి రెడ్డిపల్లి 11,12 వార్డుల్లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి





సంగారెడ్డి , వార్త వేదిక సూర్య, మార్చి 16:

సంగారెడ్డి నియోజకవర్గంలో జరిగిన పలు ఇఫ్తార్ విందుల్లో టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. కొండాపూర్ మండలం మల్కా పూర్ లో జరిగిన ప్రభుత్వ ఇఫ్తార్ విందులో నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మల్కాపూర్ సర్పంచ్ అనిల్, ఉప సర్పంచ్ ప్రవీణ్ లతో పాటు సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, నాయకులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని 11వ వార్డు మసీదు వద్ద మాజీ వార్డు కౌన్సిలర్ గడ్డం సరిత-తులసి రామ్ ఆధ్వర్యంలో దావత్-ఇ-ఇఫ్తార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసాన్నిపురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ కార్యక్రమానికి స్థానిక ముస్లిం సోదరులు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉపవాస విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం సోదరభావం, సహనం, పరస్పర గౌరవం, సేవా భావాన్ని పెంపొందించే పవిత్ర కాలమని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సఖ్యతతో జీవించాలనే సందేశాన్ని రంజాన్ పండుగ ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షఫీ, జైపాల్ రెడ్డి, స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, యువకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో స్వామి వారి ఒడిబియ్యంతో భక్తులకు అన్న సంతర్పణ



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో గల శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో సోమవారం రోజున శ్రీ వెంకటేశ్వర స్వామికి చక్రస్థానం తనంతరం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి ఒడిబియ్యాన్ని వండి భక్తులకు అన్నసంతార్పణ చేశారు. అదివారం రోజున శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా దేవస్థాన కమిటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోశిక వినయ్, కౌన్సిలర్లు బత్తుల వాణి విప్లవ్ గౌడ్,ఊదరి యాదయ్య,కోయ్యడ శేఖర్, బత్తుల జయమ్మ దాసు,గడ్డం ఇందిర రాజారత్నం, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి,చింతల ఉమామహేశ్వరి సాయిలు, పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య,ఉడుగు జ్యోతి రమేష్,పిల్లలమర్రి మధుసూదన్, దేవాలయ కమిటీ అధ్యక్షుడు నాగిళ్ల రామచంద్రం, ఉపాధ్యక్షులు చింతల ప్రభాకర్ రెడ్డి, ఊదరి శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి ఊదరి శంకర్,కోశాధికారి ఎలకరాజు నాగరాజు (మల్లేష్),ఉష్కాగుల శ్రీనివాస్,తోర్పునూరి నరసింహ గౌడ్,ఆరుట్ల లింగస్వామి, తొర్పునూరి మల్లేష్ గౌడ్,గట్టు పవన్, నకరకంటి శ్రీశైలం, ఊదరి మారయ్య, చెవగొని మహేష్, జక్కర్తి శేఖర్, నల్ల పర్వతా లు, ఉయ్యాల పల్లవి, గంగిరెడ్డి నాగలక్ష్మి, బత్తుల శ్రీశైలం గౌడ్, మంచికంటి భాస్కర్, గుజ్జల సురేందర్ రెడ్డి,అన్నెమోని గోవిందరాజు, ధర్మకర్తల మండలి బత్తుల విప్లవ గౌడ్,కాసుల వెంకటేష్,బాల్యం వెంకటాచలపతి, నల్ల గణేష్, ఆలయ అర్చకులు సంతోష్ కుమార్ శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

## యుద్ధాల పేరుతో ప్రజలపై భారాలు మోపొద్దు

పల్లె శేఖర్ రెడ్డి



యుద్ధాల పేరుతో ప్రజలపై భారాలు మోపే విధానాలు ఆపి అందరికీ వంట గ్యాస్ అందుబాటులో ఉండే విధంగాప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం చౌటుప్పల్ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్, దేశాలు చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని యుద్ధం వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతుందని అనేక దేశాలలో గ్యాస్ పేదలకు అందడం లేదని పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగే పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు, ఇరాన్ లో అను ఆయుధాలు చేస్తున్నారనే అభియోగంతో ఆదేశంపై దాడి చేసి అకారణంగా పాఠశాలలు, ఆస్పత్రులపై బాంబులు వేసి పసి పిల్లలను సాధారణ ప్రజలను చంపటం దుర్మార్గమన్నారు. రెండు దేశాల దాడుల ఫలితంగా ఇరాన్ హార్మోజ్ జల సంధిని మూసివేయడం జరిగిందని దీనితో భారత దేశం తో సహా అన్ని దేశాలలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇదేవిధంగా యుద్ధం కొనసాగితే మన దేశం ఆర్థిక వ్యవస్థ దెబ్బ తినడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఉడత రామలింగం.

## భార్యపై భర్త కత్తితో విచక్షణారహితంగా దాడి

కుటుంబ కలహాల నేపథ్యంలో దారుణ ఘటన

ముఖానికి దస్తీ కట్టుకొని ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు



ఆత్మకూరు (ఎం), మార్చి 15 (వార్త వేదిక సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో సోమవారం కుటుంబ కలహాల నేపథ్యంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యపై భర్త కత్తితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సీఐ హనుమంతు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి గ్రామానికి చెందిన వేంపటి మహేందర్, మండల కేంద్రానికి చెందిన దేవిని సుమారు 16 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి 15 సంవత్సరాల కూతురు ఉంది. గత కొంత కాలంగా దంపతుల మధ్య తరచూ కుటుంబ కలహాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సుమారు 20 రోజుల క్రితం దేవి మండల కేంద్రంలో ఉన్న తన తల్లిగారి ఇంటికి వచ్చి ఉంటుంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేందర్ ముఖానికి దస్తీ కట్టుకొని ఇంట్లోకి ప్రవేశించి దేవితో గొడవకు దిగాడు. వాగ్వాదం తీవ్ర రూపం దాల్చడంతో ఆగ్రహానికి లోనైన మహేందర్ కత్తితో దేవి పై విచక్షణ రహితంగా పలు చోట్ల దాడి చేశాడు. ఈ దాడిలో దేవికి తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా మారింది. కేకలు వేయడంతో చుట్టూ పక్కల వాళ్ళు వెళ్ళి రక్తపు మడుగులో ఉన్న ఆమెను ఆసుపత్రికి తరలించారు. దాడి చేసే క్రమంలో మహేందర్ చేతి వేళ్లకు గాయాలయ్యాయి. మహేందర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

# చౌటుప్పల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి

సోమవారం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో రాగిరు కిష్టయ్య గారి అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభం కావడంతో బావులలో బోర్లలో నీళ్లు అడుగంటాయని అన్నారు పచ్చని పొలాలన్నీ నెర్రలు పారాయని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తుందని అన్నారు ఎండిపోయిన పొలాలను అధికారులు పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు సిపిఎం నిర్వహించే ప్రజా పోరాటాలలో ప్రజలు భాగస్వామ్యం కావాలని అన్నారు రైతంగం పక్షాన సిపిఎం నిలబడుతుందని అన్నారు. ఇంటింటికి సిపిఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, రాగిరి కిష్టయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, పల్లె మధుకృష్ణ,అంతటి అశోక్, ఆదిమూలం నందీశ్వర్, బోయ యాదయ్య, పొట్ట శ్రీనివాస్ జక్కిడి దేవేందర్ రెడ్డి కొంతం సుశీల చెరుకు లక్ష్మమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలను ధైర్యంగా ఎదుర్కోవాలి



**రామన్నపేట, మార్చి 16 (వార్తా వేదిక సూర్య)**
అత్యవసర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని ప్రమాదాల నుంచి బయటపడాలని జిల్లా ఫైర్ ఆఫీసర్ కే మధుసూదనారావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఎల్లంకి గ్రామ సమీపంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సౌత్ ఈస్ట్రన్ ప్రాంత పైప్ లైన్లు పై నిర్వహించిన మూడో లెవెల్ మక్ డ్రిల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అత్యవసర పరిస్థితులలో రెస్పాన్స్ టీం ఎలా స్పందించాలో తెలిపారు. ఫైర్ ఫైటింగ్ పరికరాలు, ఎం ఓ ఎస్ ఆర్ యు వాహనం ఫైర్ టెండర్లు ఇంట్లో టేబుల్ లైట్ టవర్ల వినియోగం ఆయా విభాగాల మధ్య సమన్వయాన్ని గురించి వివరించారు. పైప్లైన్ ప్రమాద సమయంలో పాటించాల్సిన తప్పు ఒప్పుల గురించి వివరించడమే లక్ష్యంగా ప్రజలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో డి శోభ, ఎస్ ఎఫ్ ఓ బి శివాజీ, బి మధుసూదన్ రెడ్డి, జిపిఓపి బిక్షపతి, ఎంపీఓ ఎండి రావుఫ్, సిహెచ్ ఆశిష్ రాఘవ, పి మోహన్,సీనియర్ ఆపరేషన్ మేనేజర్ సోహం మలాకర్,మేనేజర్ సంతోష్ కుమార్, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి**



**చౌటుప్పల్ మార్చి 16 వార్తా వేదిక సూర్య:**
సోమవారం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో రాగిరు కిష్టయ్య గారి అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభం కావడంతో బావులలో బోర్లలో నీళ్లు అడుగంటాయని అన్నారు పచ్చని పొలాలన్నీ నెర్రలు పారాయని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తుందని అన్నారు ఎండిపోయిన పొలాలను అధికారులు పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు సిపిఎం నిర్వహించే ప్రజా పోరాటాలలో ప్రజలు భాగస్వామ్యం కావాలని అన్నారు రైతంగం పక్షాన సిపిఎం నిలబడుతుందని అన్నారు . ఇంటింటికి సిపిఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, రాగిరి కిష్టయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, పల్లె మధుకృష్ణ,అంతటి అశోక్, ఆదిమూలం నందీశ్వర్, బోయ యాదయ్య, పొట్ట శ్రీనివాస్ జక్కిడి దేవేందర్ రెడ్డి కొంతం సుశీల చెరుకు లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిని కలిసిన పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత



**(యాదాద్రి భువనగిరి బ్యూరో),మార్చి 16 వార్తా వేదిక సూర్య :**తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణని గాంధీ భవన్ హైదరాబాదులో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ తో కలిసి సోమవారం నాడు భువనగిరి పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి దేవరంగుల కవిత కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా దేవరంగుల కవిత మాట్లాడుతూ నూతన అధ్యక్షురాలు ఎర్రవెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ బలోపేతం అవుతుందని తెలంగాణ రాష్ట్ర మహిళల సమస్యల కోసం వారి నేతృత్వంలో పనిచేస్తామని మహిళా కాంగ్రెస్ లో పనిచేస్తున్న వారికి ప్రభుత్వంలో పార్టీలో అన్ని ఎన్నికలలో తగిన గుర్తింపు ఇవ్వాలని ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామాక్షి,శారద,రేణుక,శోభా తదితరులు పాల్గొన్నారు


## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలి

**▸▸ మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన తెలంగాణా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షానూర్ బాబా**




**హైదరాబాద్ , మార్చి 16 /వార్త వేధిక సూర్య :**యాదాద్రి భువనగిరి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను ఖచ్చితంగా పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు . ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పిస్తానని అన్నారు..

## సింగన్నగూడెం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన కౌన్సిలర్




**భువనగిరి ప్రతినిది, మార్చి 16 /వార్త వేధిక సూర్య :** పట్టణ పరిధిలోని సింగన్నగూడెం లోని అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం 9వ వార్డు కౌన్సిలర్ బొంతల నర్సింగ్ రావు సందర్శించి అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రభుత్వం అందించే పోషక ఆహార పదార్థాలను పరిశీలించి అంగన్వాడి సిబ్బందికి పలు సూచనలు చేశారు పిల్లలకు మంచి పోషకాలు అందించాలని వారానికి ఒకసారి పిల్లల బరువును తెలుసుకోవాలని అన్నారు ఈకార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఆయా తదితరులు పాల్గొన్నారు

## దళిత ఎమ్మెల్యే మందుల సామేల్ ఇంటిపై దాడికి కారణమైన బండి సంజయ్ ను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలి



**మోత్కూరు, మార్చి 16 (వార్త వేదిక సూర్య):** ఇటీవల గాంధీభవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో బ్రాహ్మణులపై మాట్లాడిన అంశంపై కొంతమంది అభ్యంతరం చెప్పడంతో వెంటనే ఎమ్మెల్యే మందుల సామేల్ వివరణ ఇచ్చినప్పటికీ సోమవారం భాజపా మతో న్మాద గూండాలు కార్యకర్తలు ఎమ్మెల్యే సామేల్ ఇంటిపై దాడి చేయడం ప్రజాస్వామ్యంలో సిగ్గుచేటని యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ దళిత ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయడానికి మతోన్మాద గుం డాల వెనుక కేంద్రమంత్రి బండి సంజయ్ ఉన్నారని, తక్షణమే సంజ య్ ను కేంద్ర మంత్రివర్గం నుండి తొలగించాలని కోరారు. సామేల్ ఇంటిపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని, దీని వెనకాల ఉన్న మతాల మధ్య చిచ్చు పెడుతున్న సంజయ్ ఎమ్మెల్యే మం దుల సామేల్ కు క్షమాపణ చెప్పాలని, డిమాండ్ చేశారు. సామేల్ కు దళిత సామాజక వర్గానికి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని,లేని యెడల తాము సంజయ్ ఇంటిని ముట్టడించడానికి వెనకాడబోమని సురేష్ హెచ్చరించారు.

## గాలికుంటు నివారణ టీకాలు



**మోత్కూరు, మార్చి 16 (వార్త వేదిక సూర్య ):**
ఆవులు,గేదెలు, ఎద్దులకు సీజనల్ వ్యాధులలో బాగంగా అత్యంత ప్రమాదకరమైన ఆప్తోస్ అనే వైరస్ మూలంగా పశువులకు గాలికుంటు వ్యాది సంక్రమిస్తుందని పశు వైద్యాధికారి నాగరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వ్యాధి నివారణ చర్యలలో బాగంగా సోమవారం మండలంలోని పాలడుగు గ్రామంలో పాడి రైతుల సంబంధించి ఆవులు,ఎద్దులు గేదెలకు 180 గాలి కుంటు టీకాలు వేయించారు. .ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ కౌస్య, పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మెన్ ఎడ్ల భగవంత్ ,గోపాల మిత్రలు దొండ శ్రీను,సతీష్ ,రైతులు ముప్పిడి నర్సయ్య,ముక్కెర్ల మహేష్, కొసన రవి, ముక్కముల రాములు,శ్రీశైలం, బరిగెల శేఖర్,కొంపల్లి గోరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి ఒడిలో హేతువాదం - మూఢ నమ్మకాలపై సమరం

**▸▸ చీకటిని తరిమే చైతన్య కిరణం ప్రకృతి దర్శనం - ఏం ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు చక్కర్ల నీలకంఠం**
**▸▸ మూఢనమ్మకాల నిర్మూలనా సంఘం ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం.**
**▸▸ గ్రహగతులు కాదు.. ప్రకృతి శక్తులే జీవనాధారం**
**▸▸ గద్వాల జిల్లా కేంద్రంలో జిల్లా బాధ్యులు ఎదుల్ల నాగరాజు ఆధ్వర్యంలో ప్రకృతి దర్శనం**

**గద్వాల , మార్చి 16 , (వార్తా వేదిక సూర్య) :**
అనాదిగా మానవుడిని వెన్నాడుతున్న అజ్ఞానపు చీకట్లను ఛేదించేందుకు, సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు మూఢనమ్మకాల నిర్మూలనా సంఘం మరో అడుగు ముందుకు వేసింది. ఇందులో భాగంగా నిర్వహించిన ప్ర కృతి దర్శనం' గద్వాల జిల్లా కేంద్రంలోనీ సంగాలా పార్క్ పరిసరాల్లోని ప్రకృతి ఒడిలో జరిగిన కార్యక్రమం అందరినీ ఆలోచింపజేస్తోంది. ఈ కార్యక్రమం మూడ నమ్మకాల నిర్మూలన సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ బైరీ నరేష్ అదేశాల మేరకు ఏం ఎన్ ఎస్ గద్వాల జిల్లా మాజీ అధ్యక్షుడు,ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యర్శి ఎదుల్ల నాగరాజు అధ్వర్యంలో నిర్వహించగా ఏం ఎన్ ఎస్ జిల్లా నాయకులు సరణప్ప అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మూడ నమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్కర్ల నీలకంఠం పాల్గొని మాట్లాడుతూ గ్రహాలకు, నక్షత్రాలకు మనిషి తలరాతను మార్చే శక్తి లేదని.. ప్రకృతిని అర్థం చేసుకోవడమే అసలైన విజ్ఞానమని ,కళ్లముందు కనిపిస్తున్న చెట్లు, కొండలు, నదులే మనకు జీవనాధారమని వాటిని వదిలేసి కల్పిత శక్తుల వెనుక పరిగెత్తడం వల్ల సమాజం వెనకబడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ ఎన్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎదుళ్ళ నాగరాజు,ఏం ఎన్ ఎస్ యూత్ జాతీయ



ప్రధాన కార్యదర్శి గోమాస సందీప్ సంయుక్తంగా మాట్లాడుతూ మూఢనమ్మకాలు అనేవి మెదడుకు పట్టిన తుప్పు లాంటివని, వాటిని వదిలించుకున్నప్పుడే మనిషి స్వేచ్ఛగా ఆలోచించగలడని అన్నారు. జంతు బలులు, క్షుద్ర పూజల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి,సైన్స్ మరియు టెక్నాలజీ పెరుగుతున్నా, ఇంకా పాత కాలపు నమ్మకాల్లో బతకడం విచారకరం అని, ప్రతి విషయాన్ని ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలనీ సూచించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం అయిన కార్యక్రంలో పాల్గొన్న నాయకులంతా కలిసి పరిచయ, రాజకీయా,సామాజిక అంశాలపై , మూడ నమ్మకాల నిర్మూలన పట్ల జిల్లాలో భవిష్యత్ లో చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఏం ఎన్ ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎర్పుల పల్లవి ఆధ్వర్యంలో మాన్య శ్రీ కాన్షీరాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా మూఢనమ్మకాల నిర్మూలన సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ బైరి నరేష్ చరవాణి ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించిన జిల్లా బాధ్యులు ఎదుల్ల నాగరాజు ని అభినందించి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ప్రకృతి దర్శనాలు ఆయా జిల్లాల బాధ్యుల ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు పెరుగు గౌతమ్ ,నాయకులు రమేష్ , నయీం, అశోక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయం మహేశ్వరంలో కొనసాగించాలి

**▸▸ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్**
**▸▸ మహేశ్వరం మండల కేంద్రంలోనె సబ్ రిజిస్టర్ కార్యాలయం కొనసాగించాల ప్రజల డిమాండ్**

**మహేశ్వరం మార్చి 16 వార్త వేదిక సూర్య :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మండలకేంద్రమైన మహేశ్వరం గ్రామ పరిధిలో కొనసాగుతున్న సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించాలని ఊహాగాహనాలపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ప్రస్తుతం మహేశ్వరం శంషాబాద్, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయాలను కలిపి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయం గా ఏర్పాటు చేసి జిహెచ్ఎంసి పరిధిలోని మంకల్ రెవెన్యూ ప్రాంతంలో నిర్వహించనున్నట్లు పత్రికలో వార్తలు వస్తుండడంతో మహేశ్వరం మండల ప్రజలు దీనికి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు, మహేశ్వరం సబ్ రిజిస్టర్ కార్యాలయం తరలిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం మహేశ్వరం గ్రామం 1995 సంవత్సరం నుంచి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి కేంద్రంగా కొనసాగుతూ నియోజకవర్గం ప్రజలకు రిజిస్ట్రేషన్స్ సేవలను సులభతరం చేస్తుంది ఈ కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి కూడా అధిక మొత్తంలో ఆదాయం సమకూర్తోంది ఇటీవల మహేశ్వరం ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతూ ఉండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగి రిజిస్ట్రేషన్ సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది అదేవిధంగా మహేశ్వరం ప్రాంతం కందుకూరు కడ్తాల్ ఆమనగల్ ప్రాంతాలకు మధ్య సంస్థగా ఉండడంతో ఆ ప్రాంతాల ప్రజలు కూడా ఇక్కడే సులభంగా రిజిస్ట్రేషన్ ను నిర్వహించుకుంటున్నారు ఒకవేళ ఈ కార్యాలయాన్ని జిహెచ్ఎంసి పరిధిలోకి తరలిస్తే ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు సమయం ఇతర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు . ఈ నేపథ్యంలో మహేశ్వరం మండల ప్రజలు తమ వినతిని రిజిస్ట్రేషన్, స్టాంపు శాఖ అధికారులకు తెలియజేశారు, అనంతరం అధికారులు మహేశ్వరం మండల కేంద్రంలోని సిరిగిరిపురం గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 71



లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు, అదేవిధంగా ఆర్డిఓ కూడా ఆ ప్రదేశాన్ని సందర్శించి సర్వే నిర్వహించినట్లు తెలిసింది .కాబట్టి మహేశ్వరం మండల కేంద్రంలోనే సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని కొనసాగించాలని మహేశ్వరం మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు, మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్,ఆధ్వర్యంలో మహేశ్వరం మండల సర్పంచులు అంతా కలిసి కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో.మహేశ్వరం: సర్పంచ్ మునగపాటి నవీన్, నాగిరెడ్డిపల్లి : భయాంచి దేవుల నాయక్,నాగారం: లింగం ముదిరాజ్, మాణిక్యమ్మగూడ : పద్మ కృష్ణ,సిరిగిరిపురం కృష్ణవేణి శ్రీనివాస్,దుబ్బచర్ల: శివారెడ్డి , కల్వకోల్: లక్ష్మమ్మ, దిల్వార్గూడ: మంజుల చక్రనాయక్, కేసి తండా: సుజాత మోతిలాల్ అమీర్పేట్: మల్లమ్మ, పోరండ్ల : జయమ్మ కృష్ణ, పులిమత్త :జగదీష్, ఆకనపల్లి :జ్యోతి కుమార్ నాయక్, గట్టుపల్లి : శంకరయ్య,, బిఆర్ఎస్ మండల పార్టీ పెద్దలు కర్రోల్ల చంద్రయ్య ముదిరాజ్ పోతర్ల అంబయ్య యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ పాండు యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మహేశ్వరం ఉపసర్పంచ్ జోరల రమేష్,రావీణ, మహేశ్వరం వార్డు సభ్యులు ఆజాం,హనుమంతు నాయక్, మహేశ్వరం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దుడ్డు కృష్ణ, కటికల మహేందర్,జెల్ల రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన సర్పంచ్ , ఉప సర్పంచ్



**మహేశ్వరం, మార్చి 16 , (వార్తా వేదిక సూర్య) :** మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల్ దావూద్ గూడ తండా గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులను సర్పంచ్ హనుమతు నాయక్ డిప్యూటీ సర్పంచ్ ఆర్.తేజ నాయక్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమంప్రతి వ్యక్తి గ్రామ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని గ్రామ సర్పంచ్ హనుమతు నాయక్ , ఉప సర్పంచ్ ఆర్.తేజ నాయక్, సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక99 లో భాగంగా పదవరోజు కందుకూర్ మండల పరిధిలోని దావూద్ గూడా గ్రామపంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో పారిశుధ్య కార్మిక ులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది నిరంతరం గ్రామాన్ని ,పరి సరాలను పరిశుభ్రంగా ఉంచి, ప్రజలతో మమేకమై పరిశుభ్రత పాటించేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆర్.చిట్టి బాలు నాయక్, వి. రవీందర్ నాయక్, హీరమన్ నాయక్,వి.ప్రకాష్ నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవి , పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ లో ఏకో బజార్



**రామన్నపేట, మార్చి 16 , (వార్తా వేదిక సూర్య) :** క్యాంపస్ ఏకో బజా ర్లో భాగంగా ప్రభు త్వ డిగ్రీ కళా శాల రామన్నపేట నందు జ్యూట్ బ్యాగుల త యారీ పై, మరియు పేపర్ క్రాఫ్ట్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వ హించడం జరిగింది . ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళా శాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రహత్కాణం మాట్లాడుతూ .... యువతీ యువకులు స్వ శక్తితో ఎదగడానికి జ్యూట్ బ్యాగులు తయారీ చాలా ఉపయోగపడుతుందని, దాని ద్వారా తమ యొక్క ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన లిజ్యూట్ బ్యాగుల మేకర్ శైలజ మాట్లాడుతూ..... జ్యూట్ బ్యాగుల అల్లికపై, వాటి మార్కెటింగ్ పై విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ కల్పించారు. విద్యార్థిని విద్యార్థులు భవిష్యత్తులో ఉద్యోగాలు రాని ఎడల బాధపడవలసిన అవసరం లేదని, స్వశక్తితో తామే ఉపాధిని కల్పించుకునే స్థాయికి ఎదగాలని, అందుకు ఈ జూట్ బ్యాగ్ ల తయారీ అనేది ఒక అవకాశం అని, అంతే కాకుండా ఇది తమ ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి వెంకటేశ్వరరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ జే చిన్నబాబు, డాక్టర్ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎం అనిత, టి శ్రీనివాసులు, డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రవీంద్రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీనివాస్, ఏ.ఓ. జీ .కరుణాకర్,అమర్, జె.నరేష్, ఏ.ఆంజనేయులు, రాధిక, రవి తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పలు పనులు పరిశీలించిన సర్పంచ్

**రామన్నపేట, మార్చి 16,(వార్త వేదిక సూర్య) :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామంలో 99 రోజుల ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ కునూరు సాయికుమార్ గౌడ్ పలు పనులు పరిశీలించారు ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి శాలువాలతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు, అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థుల చదువు పరిశుభ్రత భోజన మెనూ పలు అంశాలపై పాఠశాల సిబ్బందికి ఉపాధ్యాయ బృందానికి విద్యార్థిని విద్యార్థులకు తగు సూచనలు చేశారు అనంతరం అంగన్వాడి కేంద్రంలో పిల్లలకి పౌష్టికాహారం అందించాలని పిల్లల ఆరోగ్యం పట్ల తగు సలహాలు సూచనలు తల్లిదండ్రులకు అంగన్వాడి సెంటర్స్ టీచర్స్ వివరించాలని పలు అంశాలు తెలియజేశారు అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ క్షేత్రాన్ని పరిశీలించారు గ్రామంలోని ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి ఉపాధి హామీ కూలీలకు వేసవికాలం నీరు అందుబాటులో ఉండాలని, వేసవి తీవ్రతను బట్టి తగు జాగ్రత్తలు తీసుకుని పనులు కొనసాగించాలని కూలీలకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది, గ్రామంలో నీటి కొరత లేకుండా ముందస్తు చర్యగా బోరు మోటార్ల రిపేర్ తదితర సమస్యలు తక్షణ కర్తవ్యంగా నెరవేర్చమని ఆ దిశగా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ప్రతి ఒక్కరు నీటిని వేసవిని దృష్టిలో ఉంచుకొని పొదుపుగా వా డుకోవాలని నీటిని వృధా చేయకూడదని తగు సూచనలు గ్రామ ప్రజలకు



తెలియజేశారు, ప్రభుత్వ పాఠశాల అంగన్వాడి సెంటర్స్ ఉపాధి హామీ కూలీలు ఏ సమస్య ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా అన్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు, గ్రామ ఉపసర్పంచ్ బైకాని ఉమా మహేష్ యాదవ్, వార్డ్ మెంబర్స్ గోగు ప్రమీల రమేష్, కనుక మల్లేశం, మేడి ఆంజనేయులు దేవి, నేరటి మానస సురేష్, కడారి పావని పాపయ్య, గోగు సురేష్, చిరగొని కల్పన నవీన్, వనం అందాలు యాదగిరి, భోగ సహదేవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి అయ్యప్ప రెడ్డి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ విమలమ్మ, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వైద్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

**▸▸ రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని వంద పడకలుగా మార్చాలి**
**▸▸ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జహంగీర్**
**▸▸ ప్రారంభమైన సిపిఎం నిర్వహిక నిరాహార దీక్షలు**





నిరవదిక నిరాహార దీక్షలో కూర్చున్న నాయకులు సిపిఎం

**రామన్నపేట,మార్చి 16 (వార్త వేదిక సూర్య):**
రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని వంద పడకలుగా మార్చి అసెంబ్లీ సమావేశాల్లో 40 కోట్లు నిధుల కేటాయించి పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరవధిక నిరాహార దీక్షలు సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి గేటు ముందు ప్రారంభించడం జరిగింది. సిపిఎం మండల నాయకులు 8 మంది నిర్వహిక దీక్షలో కూర్చోగా వారికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంపీ జహంగీర్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లేక అశోక్ రెడ్డి పూలమాలవేసి దీక్షలు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస మౌలిక వస్తు లేక ఈ ప్రాంత ప్రజలకు ప్రజా వైద్యం అందకుండా పోతుందని అత్యవసర పరిస్థితి వస్తే దూరప్రాంతాలకు పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని నియోజకవర్గ కేంద్రంగా 8 మండలాల గ్రామాల ప్రజలకు 56 సంవత్సరాల నుండి వైద్య సేవలు అందించిన ప్రభుత్వ ఆసుపత్రి నేడు పరిమితమైన పాత భవనంలో ఎప్పుడు కోలుతుందో తెలియని ప్రమాద పంచుల్లో ఉందన్నారు. ఏరియా ఆసుపత్రి బోర్డు పెట్టి 10 సంవత్సరాలు గడుస్తున్న ఆచరణకు నోచుకోలేదని 50 పడకల కోసం అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శిలాఫలకం వేసి మూడు సంవత్సరాలు గడుస్తున్న కనీసం నిధులు రాక దుర్భర పరిస్థితిలో ఉందని అన్నారు. ఈ ప్రభుత్వాసుపత్రి ప్రధమ చికిత్స, పోస్టుమార్టంలకే పరిమితమైంది తప్ప పేదలకు వైద్యం ఉండడం లేదని వాపోయారు ప్రతిరోజు 400 మంది అవుట్ పేషెంట్లు వైద్యం కోసం వస్తారని రోగుల సంఖ్యకు అనుగుణంగా డాక్టర్లు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని, ప్రాంత ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది అన్నారు. గర్భిణీ స్త్రీలకు కనీసం స్కానింగ్ లేకపోవడంతో ప్రతిసారి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గిందని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి పై ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన స్పందించి ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో 40 కోట్ల రూపాయల నిధులు కేటాయించి వంద పడకల నూతన భవనం నిర్మించి కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వ ఆసుపత్రి పై స్పష్టమైన ప్రకటన చేసేదాకా నిరాహార దీక్షలకు కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జలల పెంటయ్య మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర నరసింహ చారి కందుల హనుమంతు మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు నాగటి ఉపేందర్ వేముల సైదులు చానకొండ రాము మొత్తం ఎనిమిది మంది ఉన్నారు. ఈ దీక్షలకు తెలుగుదేశం పార్టీ నాయ కులు ఫజల్ బేగ్, నకిరేకంటి గణేష్,దండగుల రాములు,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నోముల చిరంజీవి, గీత కార్మిక సంఘం రాష్ట్ర నా యకులు గాజుల ఆంజనేయులుసంఘీభావం తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, బల్గూరి అంజయ్య మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్,కల్లూరి నగేష్, జంపాల అండాలు మండల నాయకులు గన్నెబోయిన విజయభాస్కర్,నీల అయిలయ్య, ఎండీ రషీద్,గాదె నరేందర్, ఆవనగంటి నగేష్, బొడిగె రజిత, తొలుపునూరి శ్రీనివాస్,మేడి గణేష్, శాఖ కార్యదర్శులు మునికుంట్ల లెనిన్,తాళ్లపల్లి జితేందర్, పులిబిక్షం, గుండాల ప్రసాద్, గోగు లింగస్వామి, కొమ్ము అంజమ్మ, కూనూరు మల్లేశం,గన్నెబోయిన శ్రీనివాస్, ఆవనగంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

